


# విజయభాను

విశాఖపట్నం, గురువారం 06-07-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 234 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# ఏపీ అపరిష్కృత అంశాలపై సత్వరమే దృష్టి పెట్టండి

## మోదీకి సీఎం జగన్ విజ్ఞప్తి





న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరోజు ఢిల్లీ పర్యటన ముగిసింది. బుధవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్న ఆయన.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లతో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వాటాలు, పెండింగ్ బకాయిలతో పాటు న్యాయంగా దక్కాల్సిన సాయం గురించి ఆయన వాళ్ల దృష్టికి తీసుకెళ్లారు. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో దాదాపు 1 గంటా, 20 నిమిషాలసేపు సీఎం జగన్ భేటీ కొనసాగింది. అంతకు ముందు దాదాపు 45 నిమిషాలసేపు హెూంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. చివరగా.. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన సహా అపరిష్కృత అంశాలపై సత్వరమే దృష్టిపెట్టాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు, జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత, విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలు, కొత్త మెడికల్ కాలేజీలకు ఆర్థిక సహాయం తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారాయన. పోలవరం ప్రాజెక్టు నిర్మాణవ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపండి. సుదీర్ఘకాలంగా ఇది పెండింగ్‌లో ఉంది. పోలవరం ప్రాజెక్టు పనులను వేగంగా తీసుకెళ్లేందుకు, తొలిదశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతుంది. ఈ అంశం కేంద్ర జలశక్తి శాఖ పరిశీలనలో కూడా ఉంది.

పోలవరం తొలిదశ నిర్మాణానికి, కేంద్ర ఆర్థికశాఖ ఇప్పటికే రూ.12911.15 కోట్ల మంజూరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే తొలిదశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. ఇది ఇస్తేనే తొలిదశ పూర్తైనట్లు. మొత్తంగా పోలవరం తొలిదశ నిర్మాణానికి రూ.17144 కోట్లు ఇవ్వాలని, ఈమేరకు జలశక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తిచేశారు సీఎం జగన్. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సొంత నిధుల ఖర్చు రూ.1310.15 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని కోరారు. ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయడానికి పై రెండు అంశాలపై దృష్టిపెట్టాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తిచేసిన సీఎం.

2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ తెలంగాణ రాష్ట్రానికి సరఫరాచేసిన విద్యుత్‌కు సంబంధించి బకాయిలు అలాగే పెండింగులో ఉన్నాయి.

ఏపీకి రావాల్సిన రూ.7,230.14 కోట్ల రూపాయల చెల్లింపులకు సంబంధించి సుదీర్ఘకాలంగా పెండింగులో ఉంది. ఏపీ జెన్‌కో ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులు దృష్ట్యా ఈ బకాయిలు వచ్చేలా దృష్టిపెట్టండి. జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించిన విషయాన్ని మరోసారి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు సీఎం జగన్. ఏపీకన్నా ఆర్థికంగా ముందువరుసలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక,

తరువాయి 2లో..

జీఎస్టీ అధికారుల కిడ్నాప్ ఉదంతంపై

# కేంద్రం సీరియస్..

## కఠినచర్యలు తీసుకోవాలన్న ఆర్థిక మంత్రి



హైదరాబాద్, (విజయభాను న్యూస్) : సరూర్ నగర్ పరిధిలో జీఎస్టీ అధికారుల కిడ్నాప్.. పోలీసులు ఆ కేసును చేధించిన ఘటనను కేంద్రం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ నిర్మలా సీతారామన్.. అధికారుల కిడ్నాప్ ఘటనపై తెలంగాణ పోలీసులను ఆరా తీశారు. అధికారుల కిడ్నాప్ ఉదంతాన్ని తీవ్రంగా ఖండించిన ఆమె.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీ అంజనీ కుమార్, పోలీస్ కమిషనర్‌లను ఫోన్‌లో కోరారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జీఎస్టీ అధికారులను కిడ్నాప్ చేసిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. జీఎస్టీ కట్టని షాప్‌ను సీజ్ చేయడానికి వెళ్లిన అధికారి ఆఫీసర్ మణిశర్మ, మరో అధికారి ఆనంద్‌లను.. దుకాణదారు, మరో ముగ్గురితో కలిసి కిడ్నాప్ చేశాడు. అయితే ఆగమేఘాలపై స్పందించిన పోలీసులు కిడ్నాపర్లను వెంటాడి అధికారులను రక్షించారు. కిడ్నాప్‌కు పాల్పడిన నిందితులు ఫిరోజ్, ముజీఫ్, ముషీర్, ఇంతియాజ్‌లను అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు మీడియా ముందు హాజరు పరిచారు. ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకృష్ణా నగర్‌లో ఫేక్ జీఎస్టీ నంబర్‌తో GST కట్టని ఒక స్క్రాప్ గోదాంను సీజ్ చేసేందుకు..GST ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ మణి శర్మ , ఆనంద్ లు వెళ్లారు. ఆ సమయంలో షాప్ నిర్వాహకుడు , మరో ముగ్గురు కలిసి...

తరువాయి 2లో..

# రైతులపై పోలీస్ కేసులు నమోదు చేయడం దారుణం..

## టీడీపీ అధినేత చంద్రబాబు



అనంతపురం (విజయభాను న్యూస్) : పంట బీమా పరిహారం కోరిన రైతులపై కేసులు నమోదు చేయడం దారుణమని మండిపడ్డారు టీడీపీ అధినేత చంద్రబాబు 'నష్టపోయిన పంటకు పరిహారం అడిగిన అన్నదాతలపై అనంతపురం జిల్లాలో కేసులు పెట్టడం జగన్ ప్రభుత్వ అహంకారానికి, రైతు వ్యతిరేక పోకడలకు నిదర్శనం. బీమా కోసం రోడ్డెక్కారని ఉరవకొండలో రైతులపై కేసులు పెట్టడం సిగ్గు చేటు. మీ పాలనలో నాలుగేళ్లుగా సాగు సబ్సిడీలు లేవు.. గిట్టుబాటు ధరలు లేవు.. ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు లేవు.. ఉన్నది కేవలం ప్రశ్నించిన రైతన్నలపై కేసులు మాత్రమే' అంటూ ట్వీట్ చేశారు.

రైతుకు కష్టం వచ్చిన ప్రతిసారీ తెలుగుదేశం ప్రభుత్వం బాసటగా నిలిచిందన్నారు చంద్రబాబు. విపత్తులు, కరువు సమయాల్లో రైతును ఆదుకునేందుకు ఇన్సూరెన్సు, ఇన్ పుట్ సబ్సిడీ వంటి పాలసీలు తెచ్చి అండగా నిలబడ్డా మన్నారు. ముగిసిన వ్యవ సాయ సంవత్సరంలో పంటలకు ఎంత బీమా కట్టారో.. ఎంత నష్టం జరిగిందో.. ఎంత మంది రైతులకు ఎంత పరిహారం చెల్లించారో వివరాలు చెప్పగలరా అన్నారు. 'పంటలకు పై నాడు సాక్షాత్తూ అసెంబ్లీలో పచ్చి అబద్దాలు చెప్పి.. రైతులను వంచించి దొరికిపోయిన మీరు.. నేడు రైతులపైనే కేసులు పెట్టి అరాచకానికి అడ్రస్ గా మారారు. కేసులు పెట్టినందుకు అన్నదాతలకు క్షమాపణ చెప్పి.. బీమా సమస్యను పరిష్కరించాలి' అని డిమాండ్ చేశారు.

## తెలంగాణ, కేరళ హైకోర్టు సీజేలకు పదోన్నతి

దిల్లీ: తెలంగాణ, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు పదోన్నతి లభించనుంది. సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ను కొలీజియం సిఫార్సు చేసింది. ఉజ్జల్ భుయాన్ ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్నారు. అలాగే సుప్రీంకోర్టు జడ్జిగా వెంకటనారాయణ భట్టిని కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆయన కేరళ హైకోర్టు సేజేగా ఉన్నారు.

## ఎన్‌సిపి అధ్యక్షుడిగా శరద్ పవార్‌ని

# తొలగించిన అజిత్ పవార్

ముంబయి : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధ్యక్షుడిగా శరద్ పవార్‌ని తొలగిస్తున్నట్లు అజిత్ పవార్ బుధవారం ప్రకటించారు. ఎన్‌సిపి అధ్యక్షుడిగా తాను కొనసాగనున్నట్లు ఎలక్షన్ కమిషన్‌కు తెలిపారు. గత ఆదివారం తన బాబాయి,. ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన అజితపవార్, ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో కలిసి బిజెపితో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మిగిలిన ఎన్‌సిపి ఎమ్మెల్యేల మద్దతు కోరుతూ నేడు అజిత్ పవార్ బాంద్రాలో సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మొత్తం 29 మంది ఎమ్మెల్యేలు హాజరైనట్లు సమాచారం. శరద్ పవార్ సమావేశానికి కేవలం 17 మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. ఎన్‌సిపిలో మొత్తం 53 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.




ఖచ్చితమైన ఓటర్ల జాబితా కోసం బూత్ లెవల్ అధికారులు అడిగిన

# ఆధార్ నెంబర్/సమాచారం ఇచ్చి ప్రజలు సహాకరించాలి

## జిల్లా కలెక్టర్ డా ఏ మల్లిఖార్జున




విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్య భారతదేశ వ్యవస్థకు పట్టుకొమ్మలని జిల్లా కలెక్టర్ డా ఏ మల్లిఖార్జున అన్నారు. బుధవారం ఉదయం స్థానిక వి ఎమ్ ఆర్ డి ఏ చిల్డ్రన్ ఎరినాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలు, సూపర్ వైజర్లు మరియు బూత్ లెవల్ అధికారులకు "స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024" పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం లో భాగంగా, రెండవ రోజు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా ఏ మల్లిఖార్జున, జాయింట్ కలెక్టర్ కె యస్ విశ్వనాథన్ తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఎస్ ఎస్ ఆర్ డ్రాఫ్ట్ రిలీజ్ చేయవలసి వుంటుందని, 2024 జనవరి మాసంలో ఫైనల్ ఎస్ ఎస్ ఆర్ ప్రకటించవలసి వుంటుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు దేశాన్ని పరిపాలించాలి, ఎవరు పోటీ చేయాలి, ఎవరిని గెలిపించాలి అనే విషయాలు ఓటరు తన ఓటు హక్కును వినియోగించి నిర్ణయిస్తారు. అటువంటి ఓటరు జాబితాను రాజకీయ పార్టీలకు అతీతంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ఆదేశముల మేరకు సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల జాబితా తయారులో బూత్ లెవల్ అధికారులు ఎటువంటి వత్తిడికి లోను కాకుండా ఖచ్చితత్వంతో కూడిన జాబితాను తయారు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో ఓటర్లను తొలగించడం/చేర్చడం/మార్పు చేయడం తదితర విషయాలపై పూర్తి విషయలను ధృవీకరించుకున్న అనంతరం ఓటరు జాబితాలో పొందుపరచాలన్నారు. ఈ విషయముపై ప్రజలు తగు అవగాహన కలిగి, ఎన్నికల సిబందికి వారి ఆధార్ నెంబర్లు/సమాచారం ఇచ్చి ఖచ్చితమైన ఓటరు జాబితా తయారుకు సహకరించాలన్నారు. ఆగష్టు 2 మరియు 3 తేదిలలో కేంద్ర ఎన్నికల అధికారులు విశాఖపట్నం లో అన్ని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.



జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు గా సచివాలయంలో విధులు

తరువాయి 2లో..

# నేటి నుంచి పిఆర్‌సి ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం జనాభా అధ్యయన కేంద్రం, భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో పది రాష్ట్రాలకు చెందిన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అధికారులు, దేశ వ్యాప్తంగా ఉన్న 18 జనాభా అధ్యయన కేంద్రాల అధికారులు పాల్గొంటున్నారని ఏయూ జనాభా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య బి.ముని స్వామి తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటలకు నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో సదస్సును కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్యూటి డైరెక్టర్ జనరల్(స్టాటస్టిక్స్) అంజలి రావత్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభిస్తారు. సదస్సులో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్,ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, భారత ప్రభుత్వ స్టాటస్టిక్స్ డివిజన్ డైరెక్టర్ కుమార్ సుందరం, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రీతి తివారి తదితరులు పాల్గొంటారు. తొలిరోజు హెల్త్‌మేనేజ్‌మెంట్‌లో వస్తున్న మార్పులు తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహిస్తారు. రెండవ రోజు డేటా అనాలసిస్ బై యూజింగ్ స్టాటస్టిక్స్ అంశంపై నిపుణుల ప్రసంగాలు, ప్రత్యక్ష శిక్షన సైతం అందిస్తారు. రెండవ రోజు ఏయూ స్టాటస్టిక్స్ విభాగం ల్యాబ్‌లో సదస్సుకు హాజరైన ప్రతినిధులకు ప్రత్యక్ష శిక్షణ అందిస్తారు.

## యూజీసీ కీలక నిర్ణయం.. ఆ ఉద్యోగాల భర్తీకి పీహెచ్‌డీ తప్పనిసరి కాదు

న్యూఢిల్లీ : ఉన్నత విద్యాసంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఉద్యోగాల భర్తీకి పీహెచ్‌డీ తప్పనిసరి కాదు అని స్పష్టం చేసింది. ఆ ఉద్యోగాల మార్గదర్శకాల్లోని పీహెచ్‌డీ నిబంధనను తొలగిస్తున్నట్లు యూజీసీ ప్రకటించింది. ఈ నిర్ణయం జులై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది యూజీసీ. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు ఆయా అభ్యర్థులు నెట్, సెట్, స్లెట్ పరీక్షల్లో అర్హత సాధిస్తే చాలని తెలిపింది.

దేశంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు పోటీ పడాలంటే పీహెచ్‌డీని తప్పనిసరి చేస్తూ 2018లో యూజీసీ నిబంధనలు జారీ చేసింది. దీంతో ఆ నిబంధనలు దేశ వ్యాప్తంగా 2018, జులై 1 నుంచి అమల్లోకి వచ్చాయి. తాజాగా ఆ నిబంధనలను యూజీసీ సవరించింది. ఇకపై అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే పీహెచ్‌డీ డిగ్రీ తప్పనిసరి కాదని యూజీసీ స్పష్టం చేసింది. బోధన పట్ల ఆసక్తి కగిలి ఉండి, పీహెచ్‌డీ డిగ్రీ లేని ఎంతో మంది అభ్యర్థులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనం కలిగించింది.

## పారదర్శకత, జవాబుదారితనం లక్ష్యంగా పురపాలక శాఖ దశాబ్ది నివేదిక : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, : రాష్ట్రం ఏర్పడి పదో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా ఈసారి పురపాలక శాఖ దశాబ్ది నివేదికను విడుదల చేశామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇది చాలా సమగ్రమైన నివేదిక అని పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారితనం లక్ష్యంగా దశాబ్ది నివేదిక ఉందన్నారు. పురపాలిక శాఖ దశాబ్ది నివేదికను మంత్రి కేటీఆర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 2014 నుంచి పట్టణాల అభివృద్ధిపై ప్రతి ఏటా జూన్‌లో వార్షిక ప్రగతి నివేదికను విడుదల చేస్తున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ దశాబ్ది నివేదికలో 2014 నుంచి సాధించిన ప్రగతిని పొందుపరిచామన్నారు. 26 మున్సిపాలిటీలకు కేంద్రం అవార్డులు ఇచ్చింది. కొత్త పురపాలక చట్టం తెచ్చిన సీఎం కేసీఆర్‌దే ఈ ఘనత అని తెలిపారు. తొమ్మిదేండ్లలో పురపాలక శాఖ ద్వారా రూ. 1.21 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ పదేండ్లలో 462 శాతం ఎక్కువ ఖర్చు చేశామని తెలిపారు. ఈ పదేండ్లలో చట్టబద్ధంగా రావాల్సింది తప్ప కేంద్రం రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదు అని పేర్కొన్నారు. ఏ రంగం తీసుకున్నా గతంలో కంటే అనేక రెట్లు ఎక్కువ ఖర్చు చేశామని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన వృద్ధి సాధించాం. ఈ పదేండ్లలో గణనీయమైన, గుణాత్మకమైన తేడా కనిపిస్తుందన్నారు కేటీఆర్.

నగర అభివృద్ధి కోసం అనేక ఎస్‌పీవీలు ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. ఎస్ఆర్‌డీపీ ద్వారా 35 వరకు ఫ్లై ఓవర్లు నిర్మించామని గుర్తు చేశారు. ఉప్పల్, అంబర్‌పేట ఫ్లై ఓవర్లను జాతీయ హైవే సంస్థ పూర్తి చేయలేకపోతుందన్నారు. తాము 35 ఫ్లై ఓవర్లు పూర్తి చేస్తే, వాళ్లు 2 కూడా చేయలేకపోతున్నారు. హైదరాబాద్‌లో ప్రధాన రహదారుల నాణ్యత పెరిగిందని కేటీఆర్ తెలిపారు.

వరద ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. చెరువుల సుందరీకరణను పెద్ద ఎత్తున చేపట్టాం. ఎస్ఎన్‌డీపీ కింద నాలాలను అభివృద్ధి చేస్తున్నాం. 150 కాలనీలు గతంలో ముంపు వల్ల ఇబ్బంది పడేవి. ఎస్ఎన్డీపీ వల్ల ఈ ముంపు బాధ తప్పింది. హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీల్లో రూ. 238 కోట్లతో 19 పనులు చేపట్టాం. ఏడు పనులు పూర్తయ్యాయి. మిగతావి కూడా పూర్తి చేశాం.

హైదరాబాద్ నగరంలో 2050 నాటికి తాగునీటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఓఆర్ఆర్ పరిధిలో కూడా నీళ్ల అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని కేటీఆర్ తెలిపారు. సెప్టెంబర్ నాటికి ఎస్‌టీపీలు పూర్తి చేస్తామన్నారు కేటీఆర్. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేస్తున్నాం. అన్ని పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని పట్టణాల్లో ఇంటిగ్రేటేడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్లు నిర్మిస్తున్నాం. ఇప్పటికే పలు చోట్ల ఈ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయని కేటీఆర్ తెలిపారు.

## హైదరాబాద్ మెట్రో ఆల్ టైమ్ రికార్డు..

### ఒకే రోజు 5.10 లక్షలు దాటిన ప్రయాణికులు

హైదరాబాద్, : హైదరాబాద్ మెట్రో సరికొత్త రికార్డును సృష్టించింది. ఒకే రోజు 5.10 లక్షల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చింది. జూలై 3వ తేదీ సోమవారం ఈ రికార్డు నమోదైందని, మెట్రో చరిత్రలో ఇది ఒక చరిత్రాత్మక మైలు రాయి అని ఎల్ అండ్ టీ మెట్రో ఎం.డీ, సీఈఓ కేవీబీ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన మెట్రోకు మొదటి నుంచి మంచి ఆదరణ ఉందన్నారు. ఇది నిజంగా తమకు ముఖ్యమైన సందర్భమని, నగర వాసులు మెట్రో ప్రయాణాన్ని ఎంతో ఇష్టపడుతున్నారనడానికి ఇది నిదర్శనమన్నారు. 2020 మార్చి చివరి వారం నుంచి కొవిడ్-19 ప్రభావం మెట్రోపై తీవ్ర ప్రభావాన్ని చూపినా, ఆ తర్వాత కోలుకొని మళ్లీ ప్రయాణికుల ఆదరణను చూరగొందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకారం ఉండటంతో పాటు నగర ప్రజలకు అత్యంత అనుకూలమైన, విశ్వసనీయమైన, వేగవంతమైన రవాణా వ్యవస్థగా మెట్రో నిలిచిందని కేవీబీ రెడ్డి తెలిపారు. 2017 నవంబరు 29 నుంచి ప్రారంభమైన మెట్రో సేవలు నగర వ్యాప్తంగా 69 కి.మీ మేర 3 కారిడార్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు. మెట్రోలో ప్రయాణం చేస్తూ, ఎంతో ఇష్టమైన ప్రయాణ సాధనంగా ఎంచుకున్న ప్రయాణికులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు.

కారిడార్-1లో 2.60లక్షల మంది

మెట్రో మొదటి దశలో భాగంగా మూడు కారిడార్‌లలో 69 కి.మీ మేర మెట్రో మార్గాన్ని చేపట్టారు. కారిడార్-1లో(మియాపూర్-ఎల్‌బీనగర్) మార్గంలో 2.60 లక్షల మంది, కారిడార్-2లో (జేబీఎస్-ఎంజీబీఎస్), కారిడార్-3 (నాగోల్- రాయదుర్గం)లో 2.25లక్షల మంది ప్రయాణం చేశారని హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

అత్యధికంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి మొత్తం మూడు కారిడార్‌లలో కలిసి 56 మెట్రో స్టేషన్‌లు ఉండగా, అందులో అత్యధికంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి 32వేల మంది ప్రయాణికులు, ఎల్‌బీనగర్ నుంచి 30వేల మంది, అమీర్‌పేట మెట్రో స్టేషన్ నుంచి 29వేల మంది, మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి 23 వేల మంది ప్రయాణం చేశారని మెట్రో అధికారులు తెలిపారు.

## అధిష్ఠానాన్ని ఏదీ అడగలేదు.. పార్టీయే గుర్తించి ఇచ్చింది : కిషన్‌రెడ్డి




హైదరాబాద్, : తాను పార్టీని ఎప్పుడూ ఏదీ అడగలేదని.. అధిష్ఠానం గుర్తించి ఇచ్చిన అన్ని బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించానని కేంద్ర మంత్రి, తెలంగాణ భాజపా నూతన అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ భాజపా చీఫ్‌గా నియమించిన తర్వాత.. తొలిసారి ఆయన మీడియాతో మాట్లాడారు. "మొదటిసారి ఎంపీగా గెలిచా. నాలుగేళ్లలో సుమారు రెండేళ్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా చేశాను. కేంద్ర మంత్రిగా ప్రధాని మోదీ నాకు బాధ్యతలు ఇచ్చారు. దీంతో మరో రెండేళ్లు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రిగా చేశాను. ఎప్పుడూ పార్టీని ఏదీ అడగలేదు. మంత్రి అవుతానని.. కావాలని .. ఏదీ అడగలేదు. పార్టీయే నన్ను గుర్తించింది. ఇప్పటివరకు పార్టీ ఆదేశాలను పాటిస్తూ వచ్చాను. 1980 నుంచి ఈరోజు వరకు పార్టీ సైనికుడిగా పనిచేశా. నాకు పార్టీకి మించి ఏదీ లేదు. పార్టీయే నా శ్వాస. పార్టీ కోసం.. పార్టీ సిద్ధాంతం కోసం పనిచేసే ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. జాతీయ నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం.. అందరితో కలిసి సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తా. వారితో చర్చించి తెలంగాణలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో భాజపాను అధికారంలోకి తీసుకొచ్చే లక్ష్యంతో ముందుకెళ్తాం. తెలంగాణలో భాజపా అధికారంలోకి తీసుకొచ్చే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తాం. ఇవాళ హైదరాబాద్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేశాం. జులై 8న ప్రధాని మోదీ వరంగల్ వస్తున్నారు. ఈ రెండు రోజులు వరంగల్ సభ ఏర్పాట్లపై చర్చించి.. సభను విజయవంతం చేస్తాం" అని కిషన్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో దక్షిణ భారత రాష్ట్రాల సమావేశం..

"దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి ముఖ్యమైన నాయకులతో కూడిన సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, ఏపీ, తెలంగాణ, లక్షద్వీప్ చెందిన నాయకులు సమావేశానికి హాజరవుతారు. దక్షిణ భారతదేశంలో భాజపా తీసుకోవాల్సిన చర్యలు, రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై భేటీలో చర్చిస్తాం. దక్షిణ భారత్‌లో భాజపాను మరింత పటిష్టం చేయాలి.. అందుకు తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన విధానాలపై సమావేశంలో చర్చిస్తాం" అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## శ్రీశైలం భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి : ఈవో



హైదరాబాద్ : శ్రీశైలం ఆలయానికి వచ్చే భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని శ్రీశైలం ఆలయ ఈవో లవన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయంలోని లడ్డు, ప్రసాద విక్రయ కేంద్రాలతో పాటు అన్న ప్రసాద వితరణను ఆయన తనిఖీ చేశారు. లడ్డు ప్రసాదాల విక్రయ కేంద్రాలలో స్టాకు నమోదు, లడ్డు ప్రసాదాల టికెట్ల జారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. భక్తులు అధిక సమయం క్యూలైన్లలో ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం ఆయన అన్నదాన భవనంలోని వంటశాల, అన్నదానం స్టోర్లను పరిశీలించి స్టోరులో స్టాకు రిజిస్టరు ను పరిశీలించారు. కూరగాయలు తాజాగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని , వంటకాలన్నీ రుచికరంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్నప్రసాద వితరణ సజావుగా జరిగేవిధంగా ప్రతి హాలును నిరంతరం పర్యవేక్షిస్తుండాలని వివరించారు. శుచీ, శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడి అభిప్రాయాలను తీసుకున్నారు.

## అడవి బిడ్డలను అన్నదాతలను చేసినం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, : ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కుమ్రం భీం ఆశయ సాధనకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, జల్ జంగల్ జమీన్ స్పూర్తితో అడవి బిడ్డలను అన్నదాతలుగా చేసి భూమి హక్కులను కల్పిస్తున్నామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. కుబీర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 4,05,601 ఎకరాలకు చెందిన 1.51 లక్షల మంది అడవి బిడ్డలకు పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇకపై పోడు భూములకు కూడా రైతు బంధు ఇస్తామన్నారు. గిరివికాసం పథకం ద్వారా గిరిజన రైతులకు మేలు చేస్తున్నామని, పట్టాదారులు తమ భూముల్లో బోర్లు వేసుకునేందుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిజేస్తామని వెల్లడించారు.

## జీఎస్టీ అధికారుల కిడ్నాప్ ఉదంతంపై కేంద్రం సీరియస్..

ఫార్చ్యూనర్ కార్ లో కిడ్నాప్ చేశారు. GST అధికారుల ఐడీ కార్డు లు చింపి..వారి పై దాడి చేశారు. మాకు సమాచారం అందగానే... దిల్‌సుఖ్ నగర్ రాజీవ్ చౌక్ వద్ద కిడ్నాపర్స్ ను అదుపులోకి తీసుకున్నాము. ఒక నిందితుడు ఖాయూం పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నాం అని డీసీపీ వెల్లడించారు.

## ఏపీ అపరిష్కృత అంశాలపై సత్వరమే దృష్టిపెట్టండి

గుజరాత్ రాష్ట్రాలకు జాతీయ ఆహార భద్రతాచట్టం కింద అధిక శాతం కవరేజీ ఉంది. కానీ, పథకం అమలుకు ఎంచుకున్న ప్రమాణాల్లో హేతుబద్ధత లేదు. నీతిఆయోగ్ కూడా దీన్ని నిర్ధారించింది. రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కకుండా పోతోంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోంది. అందుకే సత్వరమే జోక్యం చేసుకోండి. ప్రతినెలా వినియోగించకుండా దాదాపు లక్ష టన్నుల బియ్యం కేంద్రం వద్ద ఉంటోంది. ఇందులో 77వేల టన్నులు రాష్ట్రానికి ఇస్తే సరిపోతుంది. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు పెండింగులో ఉన్నాయి.

ప్రత్యేక హోదా సహా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టండి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా దోహదపడుతుంది. రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. ఈమేరకు సానుకూల నిర్ణయం తీసుకోండి.

రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాకు కనీసంగా 18 లక్షల జనాభా ఉంది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న 11 కాలేజీలకు తోడు అదనంగా మరో 17 కాలేజీల నిర్మాణాలను చేపట్టాం. ఈ కాలేజీలకు తగిన ఆర్థిక సహాయం చేయండి. వైయస్సార్ కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్ర హామీ ఇచ్చింది. వెనకబడ్డ రాయలసీమ ప్రాంతంలో జీవనోపాధి మెరుగుపడ్డానికి, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డానికి ఈ ప్రాజెక్టు చాలా అవసరం. స్టీల్‌ప్లాంట్‌కు అత్యంత అవసరమైన ముడి ఖనిజంకోసం మూడు గనులను ఏపీ ఎండీసీకి కేటాయించేలా కేంద్ర గనులశాఖకు ఆదేశాలు ఇవ్వండి.

ఏపీ పౌరసరఫరాల శాఖకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.1,702.90 కోట్లను మంజూరుచేయండి. 2012-13 నుంచి రూ. 2017-18 వరకూ ఇవి పెండిగులో ఉన్నాయి అని ప్రధాని మోదీకి ఏపీకి సంబంధించిన పలు అంశాలను వివరించారు సీఎం జగన్.

## ఖచ్చితమైన ఓటర్ల జాబితా కోసం బూత్ లెవల్ అధికారులు అడిగిన ఆధార్ నెంబర్/సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలి

నిర్వహిస్తున్న వారిని వినియోగించడం జరుగుతుందన్నారు. బూత్ లెవెల్ అధికారులకు సూమారు 1500 వరకు ఓటర్ల జాబితా తయారు చేయాల్సి ఉంటుందన్నారు.

రెండవ రోజు శిక్షణా కార్యక్రమంలో విశాఖపట్నం ఈస్ట్, విశాఖ నార్త్, పెందుర్తి అసెంబ్లీ నియోజక వర్గాలలో విదులు నిర్వహించే ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, సూపర్ వైజర్లు మరియు బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటి ఇంటి కి వెళ్లి వెరిఫికేషన్ చేసిన తర్వాత మాత్రమే ఓటర్లను తొలగించడం/చేర్చడం/మార్పు చేయడం తదితర విషయాలపై పూర్తి విషయలను ధృవీకరించుకున్న అనంతరం ఓటరు జాబితాలో పొందుపరచాలన్నారు. ఓటరు జాబితా తయారు లో బూత్ లెవల్ అధికారులు ఉద్దేశ పూర్వకంగాగాని, ఇతర ప్రలోభాలకు ఆశపడి పొరపాట్లు చేసినా కఠిన శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహేబ్, వి.యం.ఆర్.డి.ఎ. ఎస్టేట్ అధికారి లక్ష్మణా రెడ్డి, డిప్యూటి కలెక్టర్లు, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, సూపర్ వైజర్లు మరియు బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో బాలికపై అత్యాచారయత్నం.. కాపాడిన ట్రాన్స్‌జెండర్



హయత్‌నగర్, : ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారయత్నానికి ప్రయత్నించారు. ఆ ఇద్దరు వ్యక్తుల నుంచి బాలికను ఓ ట్రాన్స్‌జెండర్ కాపాడారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

ఈ మేరకు బుధవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ జోనల్ డీసీపీ సాయిశ్రీ కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా, మోతె మండలం, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేటలో నివాసముంటున్నారు. వారి పెద్ద కుమార్తె 2021లో పదో తరగతి పూర్తి చేసింది. అనారోగ్య సమస్యల వల్ల ఆమె చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుంది.

తండ్రి అక్కడే వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 9.30 గంటలకు భోజనం ముగించుకుని బాలిక ఇంటి బయట ఉన్న మెట్ల కింద టాయిలెట్ కోసం వచ్చింది. ఇంతలోనే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి గేటు వద్ద బైక్‌ను ఆపి సెల్‌ఫోన్ చూపిస్తూ అడ్రస్ అడిగారు. అడ్రస్ చెబుతుండగానే ఆమెను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని పారిపోయారు. అనంతరం ఆమెను స్థానికంగా ఉన్న నాయుడు హోటల్ వెనుకాల ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. గేటుతో ఉన్న కంపౌండ్ వాల్‌లోకి బాలికను విసిరేశారు. అరవింద్ అనే వ్యక్తి బాలిక మెడపై ఉన్న చున్నీని తొలగించగా మరో యువకుడు కాళ్లను గట్టిగా పట్టుకున్నాడు.

అరవింద్, మళ్లీ బాలిక టాప్‌ను తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా బాధితురాలు తప్పించుకుని విజయవాడ జాతీయ రహదారిపైకి పరుగెత్తుకు వచ్చింది. అక్కడ బాధితురాలిని గమనించిన ట్రాన్స్‌జెండర్, ఆమె తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం బాధితురాలిని హయత్‌నగర్‌లోని మ్యాక్స్‌క్యూర్ ఆస్పత్రికి తరలించారు. బాలిక ఎడమ కాలికి గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారు.

తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులు అరవింద్, అజయ్‌ల కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అరవింద్ అనే వ్యక్తి బాలిక ఇంటికి సమీపంలో ఉన్న శ్రీకృష్ణ కిరాణ దుకాణం వద్దకు రెగ్యులర్‌గా వచ్చేవాడని పోలీసుల విచారణలో తేలింది.

# ప్రభుత్వ ఐటిఐ లో జాబ్ మేళా



గాజువాక (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్మోహన్రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈనెల ఏడవ తేదీన వికాస్ నగర్లోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది నుండి పీజీ వరకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ఈ మేరకు జాబ్ మేళా గోడ పత్రికలను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు దొడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్ ప్రారంభం



ప్రీ ఆడిట్ అనుమతి పత్రాలు కమిషనర్ కు అందిస్తున్న జిల్లా ఆడిట్ అధికారి

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆడిట్ ప్రారంభించారు. వివిధ పద్దుల బిల్లులు చెల్లింపులకు ముందస్తు ఆడిట్ విధానం ప్రారంభించినట్లు జిల్లా ఆడిట్ అధికారి బి. అరుణకుమారి అన్నారు. ప్రతీ బిల్లు చెల్లింపునకు ముందుగానే ఆడిట్ అవుతుందని తెలిపారు. తరువాత బిల్లులు చెల్లించు కోవచ్చునని వెల్లడించారు. గతంలో ఆర్థికసంవత్సరం చివరిలో ఆడిట్ జరిగేదని, ఇప్పుడు మార్పులు జరిగాయని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ప్రీ ఆడిట్ తో పాటు పోస్ట్ ఆడిట్ కూడా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ అసిస్టెంట్ అధికారి ప్రభావతి, సీహెచ్.తిరుపతినాయుడు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ ఎంవీ నాగరాజు, జేఏఓ గోపీశ్రీను తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు లో తగరపువలస శ్రీకృష్ణ కళాశాల విద్యార్థుల ప్రతిభ



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : ఆంధ్రాయూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో తగరపువలసలో ఉన్న శ్రీ కృష్ణా డిగ్రీ కాలేజ్ విద్యార్డులు ప్రతిభ కనభరిచినట్లు కళాశాల చైర్మన్ బి.నర్సింగ రావు తెలిపారు. భీమిలి మండలం మొదటి స్ధానంలో బి స్సీ మొదటి సంవత్సరం చదువుతున్న డి. దీపిక కు పది పాయంటలుకు గాను 9.28 పాయింట్లు రాగా ,కుందన ఆది శ్రీ 8.68, ఎన్. తేజస్విని 8.68 పాయింట్లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పుష్పగుచ్చాల తో సత్కరించారు. కాగా ఉత్తీర్ణత 90 శాతం సాదించారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె. సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె. చిట్టిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ములియగుడ గ్రామంలో స్ఫూర్తి ప్రాజెక్ట్ నిమిత్తం స్థలం సేకరణ..



అనంతగిరి, విజయభాను న్యూస్ : మండలంలో టోకూరు పంచాయతీలో ములియగుడ గ్రామంలో, అనంతగిరి మండల సమాఖ్య వెలుగు ఏపీఎం సూర్యారావు ఆధ్వర్యంలో...

స్ఫూర్తి ప్రాజెక్ట్ నిమిత్తం స్థలం సేకరించడం జరిగింది,సర్వే నెంబర్ 3/1లో విస్తీర్ణం 80సెంట్లు భూమి స్ఫూర్తి ప్రాజెక్ట్ నిమిత్తం,అనంతగిరి మండల సర్వే ర్ హద్దులు చూపుట జరిగింది. ఈ కార్యక్రమంలో సీ.సీ.శ్రీరాములు, హెచ్.డి.సీ.సీ, ఆఫ్.పి.ఓ.సీ.సీ, పాల్గొన్నారు

# ఫార్మాసిటీలో నేడు ఎమ్మెల్యే నాగిరెడ్డి పర్యటన



గాజువాక(విజయభాను న్యూస్): నియోజకవర్గం పరిధి 85వ వార్డు ఫార్మా సిటీలో ఈనెల 6వ తేదీన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పర్యటించనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే తన పర్యటనలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వారు తెలిపారు. దీనిలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటారని అన్నారు. ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రాజాంలో కుండపోత వర్షం



రాజాంలో ప్రధాన రహదారిపై నీటి ప్రవాహం

రాజాం (విజయభాను న్యూస్) : రాజాంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంటకాలంపాటు కురిసిన ఈవర్షానికి రాజాంలోని ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారాయి. ప్రయాణీకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

## ఈ నెల 23న

# ప్రేరణ ప్రతిభా పరీక్ష

రాజాం (విజయభాను న్యూస్) : రాజాంకు చెందిన శ్రీమతి లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ప్రేరణ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి గగన్ దీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో 2021, 22, 23 సంవత్సరాల్లో గ్రాడ్యుషన్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. సివిల్ సర్వీస్ పై ఆసక్తి ఉండి విజయం సాధించాలనుకునే విద్యార్థులకు ఈ పరీక్ష ద్వారా ప్రతిభ కనభరిస్తే ఇందులో పదిమందిని ఎంపిక చేసి లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ఉచితంగా ఢిల్లీ, హైదరాబాద్ ప్రాంతాల్లో శిక్షణ ఇప్పిస్తుందని అన్నారు.

ఈనెల 4 నుంచి ధరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, వందరూపాయల పరీక్ష ఫీజు ఉంటుందని వెల్లడించారు. పరీక్షకు హాజరైనవారికి ఈ రూ. 100లు తిరిగి వాపసు ఇవ్వబడుతుందని వెల్లడించారు. మిగిలిన వివరాలకు 8074402554 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

# భీంపోలు పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం



అనంతగిరి, విజయభాను న్యూస్ : భీంపోలు పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమంలో ఇన్కమ్ సర్టిఫికెట్ లు కులదృవీకరణపత్రాలకు ప్రజలు అప్లైచేయగా సర్టిఫికేట్ లు ఇవ్వడం జరిగింది, త్రాగునీరు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఈ కార్య క్ర మ మునకు ప్రత్యేక అధికారి సూర్య లక్ష్మి ,అల్లూరి జిల్లా జె,సి, శివ శ్రీనివాస్ , తహసీల్దార్,రాంబాయి ఎంపీపీ నీలవేణి, ఎంపీటీసీ అశోక్, సర్పంచ్ బీమ లమ్మా, ఉప సర్పంచ్ అప్పలకొండ,ఆర్ ఐ, నల్లన్న, ఈఓ ఆర్డి గోపాలకృష్ణ, కార్యదర్శి రాంబాబు, సచివాలయం సెక్రటరీ ఈశ్వర రావు, ఏఈఈ, భీంపోలు కాశీపట్నం, కొత్తూరు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, ప్రజలు పాల్గొన్నారు, మొత్తం సర్టిఫికెట్స్ 190, జెనరేట్ అయినవి 60 లబ్ధిదారులు కి 40 సర్టిఫికెట్లు ఇచ్చియున్నారు,

# రావాడ పంచాయతీ గల అక్రమాలు అన్నింటిని తొలగించండి

## ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేసిన మొల్లి గంగాధర్ దంపతులులి



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలంరావాడ పంచాయతీ లో ఆక్రమణకు గురి అయినా ప్రభుత్వ భూమి మరియు బంజరు,పోరంబోకు స్థలాలు, కబ్జా చేసిన వాటిని అన్నింటినీ తొలగించాలని కోరుతూ బుధవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో వార్డు మెంబర్ మల్లు గంగాధర్ దంపతులు ఎమ్మార్వో కనకరావు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న మా షాప్ ను తొలగించినట్లు , రావాడ పంచాయతి లో వైఎస్సార్సీపీ అధికార పార్టీ నాయుకులు, ప్రజా ప్రతినిధులు చెప్పినట్లు వచ్చి మీరు మా షాప్ ను తొలగించారు. మా రావాడ పంచాయతీ అన్నీ కూడా తొలగించాలి, ఆక్రమణకు గురి అయిన భూములను పరిరక్షణ కల్పించే విధంగా కృషి చేయాలి అని, అన్యాక్రాంతం అయిన భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి ఉపయోగించాలి అనీ, కొన్ని ఎకరాలు ఆక్రమించి ఉన్నా వాటిని తమరు స్వాధీనం చేసుకోవాలి అని మండల తహశీల్దార్ గారుకీ మొల్లి గంగాధర్ (వార్డ్ మెంబర్),దంపతుల వినతి పత్రం ఇవ్వటం జరిగింది.

ఈ కార్యక్రమంలో వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు), సారిపల్లి జోగి నాయుడు (మాజీ ఎంపీటీసీ), మొల్లి అప్పల రాజు, వియ్యపు సూర్య చంద్ర ఆప్పారావు, కారుకొండ పూర్ణా, మొల్లి సంజీవి, కారుకొ%శీ%డ కొనారి, కారుకొండ నరేశ్, బొట్ట సోమినాయుడు, మొల్లి శ్రీను, కారుకొండ అప్పలరాజు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు..

# రావాడ, భరిణికం గ్రామాల్లో అక్రమాలు తొలగింపు

## అక్రమాలపై పరవాడ ఎమ్మార్వో కనకారావు ఉక్కు పాదం





పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం రావాడ పంచాయతీ మరియు భరణికం గ్రామాల్లో అక్రమ కట్టడాలను, కంటైనర్ల, బడ్డీను మరియు గెడ్డ వాగు అక్రమాలను స్థానిక ఎమ్మార్వో పి. కనకారావు ఆదేశాల మేరకు ఆర్ ఐ శ్రీ లేక ఆధ్వర్యంలో బుధవారం అక్రమాలను తొలగించారు.. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బంది మాట్లాడుతూ రావాడ పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 61 లో గల కంటైనర్ ను తొలగించామన్నారు.. రావాడ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ సర్వే నంబర్ 394లో గల అక్రమ బడ్డీని తొలగించామన్నారు .. అలాగే మోటూరు వానిపాలెం మెట్ట మీద సర్వే నెంబర్ 71 ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కడుతున్న అక్రమ కట్టడాన్ని తొలగించమన్నారు.. బరిణకం పంచాయతీ పరిధిలో 180 మరియు 181 లో గల గెడ్డ వాగు అక్రమం తొలగించామన్నారు..

ఈ సందర్భంగా...

పరవాడ ఎమ్మార్వో పి.కనకారావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు గెడ్డ వాగులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే ఎంతటి వార్నైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు...

# విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టండి

## కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం, విజయభాను న్యూస్ : పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో చేపట్టిన పనులపై విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతోఆమె సమీక్ష నిర్వ హించారు. సెప్టిక్ ట్యాంకులు, సంపులు, పునాదుల కోసం తవ్విన గోతుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అప్ర మత్తంగా ఉండాలని సూచించారు.

గుంత లున్న ప్రదేశాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తరగతి గదులు, వంట షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల బ్యాంకు ఖాతాల్లో రూ.10 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయని, శుక్రవారం లోగా పెండింగ్ బిల్లులను అప్లోడ్ చేయాలని సూచించారు.

డీఈవో బి.లింగేశ్వరరెడ్డి, డీవీఈవో సురేష్కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## మరో మతత్వ అజెండా

మతతత్వాన్ని ప్రధాన అజెండాగా తెరమీదకు తెచ్చేందుకు, మత వైషమ్యాలను రగిల్చేందుకు ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్–యుసిసి)ని కాషాయ పార్టీ ముందుకుతేవడం అవాంఛనీయం. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల చేసిన ప్రకటన ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మతపరంగా మైనారిటీ వ్యతిరేక భావాలను రగిలించడం ద్వారా మెజారిటీ ఓట్లను కొల్లగొట్టాలనే ఉద్దేశంతో చేసిందే. రెండు నెలలుగా మంటల్లో మాడిపోతున్న మణిపూర్‌పై నోరుమెదపని ప్రధాని యుసిసిపై మాట్లాడటం పథకం ప్రకారం జరుగుతున్నదే. ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి అజెండాలో ప్రధాన అంశాలు రామజన్మభూమి, 370వ అధికరణ రద్దు, ఉమ్మడి పౌరస్మృతి. 'ఉమ్మడి పౌరస్మృతి ఈ దశలో అవసరమూకాదు.. వాంఛనీయమూ కాదని' 2018 ఆగస్టులో 21వ లా కమిషన్ విడుదల చేసిన సంప్రదింపుల పత్రంలో స్పష్టంగా పేర్కొన్నది. అయినప్పటికీ, తాజాగా 22వ లా కమిషన్ మళ్లీ దాన్ని తెరపైకి తెచ్చింది. మోడీ ప్రభుత్వ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ప్రస్తుత కమిషన్ ఉమ్మడి సివిల్‌కోడ్‌పై అభిప్రాయ సేకరణ తంతు చేపట్టింది. ఆదేశిక సూత్రాల్లోని ఉమ్మడి పౌరస్మృతి అమలుకు అడుగులు వేస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నారని కాషాయ సమర్థకులు ప్రశ్నిస్తు న్నారు. ఆదేశిక సూత్రాల్లోని సార్వత్రిక విద్య, పని, నిరుద్యోగ భృతి వంటి హక్కులను అమలులోకి తీసుకొస్తే కరోనా కాలంలో అనేక మంది వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయే వారే కాదు. కర్ణాటకలో అధిక సంఖ్యాకులైన లింగాయతులు తమను ప్రత్యేక మతంగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. శైవులు, వైష్ణవులతోపాటు కులాలవారీగా భిన్న ఆచారాలు, ఎన్నో విభిన్నతలు ఉన్నాయి. ఆదివాసీలకు ప్రత్యేక సాంప్రదాయాలున్నాయి. పంజాబ్‌లో వారసత్వ హక్కులు సిక్కులకు ఒక విధంగా, హిందువులకు మరో విధంగా ఉన్నాయి. వాటన్నింటిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలా? యుసిసిని ఒక ఎన్నికల ప్రచార అస్త్రంగా, ముస్లిముల మీద విద్వేషాలను, వ్యతిరేకతను రెచ్చగొట్టి మెజారిటీ ఓటుబ్యాంకును సంస్థాగతం చేసుకోవడమే లక్ష్యంగా బిజెపి ముందుకెళ్తోంది. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే సంస్కృతి పేరుతో దేశంలో బహుళత్వాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. కర్ణాటకలో ఓటమి, మణిపూర్ హింసాకాండ, రెజ్లర్ల నిరసన, విపరీతంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల ఆందోళనలు... బిజెపి సర్కారుపై కొన్ని సెక్షన్లలో ఉన్న భ్రమలను దూరం చేశాయి. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి సమావేశం తర్వాత మోడీ సర్కారుకు బెంగ పెరిగింది. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ సంస్కృతి. అనేక సంఘాలు, సంస్కతుల మిశ్రమంగా ఉన్న దేశంలో, వివిధ వర్గాల వ్యక్తులు వారి స్వంత ఆచారాలు, మతపరమైన నియమాలను అనుసరిస్తారు. దీన్ని మార్చి ఒకే సివిల్ కోడ్ అమలు చేయాలన్న ఎత్తుగడ రాజ్యాంగ సారాంశానికి విరుద్ధం. ప్రత్యేక వ్యక్తిగత చట్టం ముస్లిములకే పరిమితం కాదు. మిగిలిన మతాల్లోనూ అనేక ప్రత్యేక అంశాలున్నాయి. గిరిజన తెగల్లోనూ రకరకాల ఆచారాలు, సాంప్రదాయాలు ఉన్నాయి. ఏకరూపత పేరుతో సాంస్కృతిక వైవిద్యాన్ని నాశనం చేయడం జాతి సమైక్యతకే ప్రమాదం. రాజ్యాంగ విరుద్ధం. హిందూ మతానికి వస్తే నిచ్చెనమెట్ల కులవ్యవస్త, దుర్మార్గమైన కులవివక్ష నెలకొన్నాయి. భారతీయ సమాజంలో లింగవివక్ష మరో ప్రధానమైన సమస్య.

మహిళా రిజర్వేషన్ల బిల్లును పాలకులు దశాబ్దాల తరబడి కోల్డ్ స్టోరేజిలో పెట్టారు. విధానపరంగా ప్రధాన పార్టీలు దాన్ని వ్యతిరేకించడం లేదు కాని బిల్లు మాత్రం ఆమోదం పొందదు. మోడీ సర్కారుకు ఏమాత్రం ఇంగితం ఉన్నా రానున్న పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదింప జేయాలి. మోడీ సర్కారు ముందుకుతెస్తున్న ఏకరూపత అంటే సమానత్వం కాదు. అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకు సమాన హక్కు ముందుగా కల్పించాలి.

అన్ని కమ్యూనిటీలకు సంబంధించిన పర్సనల్ చట్టాలు లేదా సాంప్రదాయ చట్టాలను సంస్కరించడం ద్వారానే అది సాధ్యం. ముందుగా అందరితో చర్చించి, ఏకాభి ప్రాయానికి రావాలి. అన్ని కమ్యూనిటీల్లో స్త్రీ, పురుషులందరి ప్రజాస్వామిక భాగ స్వామ్యంతో ముందుకు సాగాలి.

## ఈ రూట్లలో వందేభారత్ రైళ్ల టికెట్ ధరలు తగ్గించే ఛాన్స్



దిల్లీ: దేశంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో 23 రైళ్లను కేంద్రం ప్రారంభించింది. మరికొన్ని రైళ్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రధాన రూట్లలో ఈ రైళ్లను నడుపుతున్నారు. ఈ సెమీ-హైస్పీడ్ రైళ్లు చాలా వరకు ఫుల్ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. కొన్ని రూట్‌లలో మాత్రం ప్రయాణికుల నుంచి ఆదరణ అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా తక్కువ దూరం ప్రయాణించే రైళ్ల విషయంలో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో తక్కువ ఆక్యుపెన్సీ ఉన్న వందే భారత్ రైళ్లలో టికెట్ ధరలు తగ్గించాలని రైల్వే శాఖ భావిస్తున్నట్లు సమాచారం. ఇండోర్– భోపాల్, భోపాల్– జబల్‌పూర్, నాగ్‌పూర్– జబల్‌పుర్ వందే భారత్ రైళ్లు ఈ కేటగిరీ కిందకు రానున్నాయి. జూన్ నెలకు సంబంధించి ఆయా రైళ్ల ఆక్యుపెన్సీని పరిశీలిస్తే.. భోపాల్– ఇండోర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కేవలం 29 శాతం ఆక్యుపెన్సీని నమోదు చేయగా.. ఇండోర్– భోపాల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కేవలం 21 శాతం ఆక్యుపెన్సీని మాత్రమే నమోదు చేసింది. ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం 3 గంటలు కాగా.. ఏసీ ఛైర్‌కార్‌కు రూ.950, ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ ధర రూ.1525గా ఉంది. అయితే, ఆయా రైళ్ల టికెట్ ధరలను సమీక్షించనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

### విజయవాడ – చెన్నై మధ్య వందేభారత్

'దేశంలో చాలా వందే భారత్ రైళ్లు 100శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. కొన్ని మాత్రమే తక్కువ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ ప్రయాణ సమయం ఉన్న రైళ్లలో టికెట్ ధరలు తగ్గిస్తే మరింత ఆదరణ సొంతం చేసుకుంటాయి. మరింత మంది ప్రయాణికులు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వినియోగించుకునేలా కొన్ని మార్పులు చేయాల్సి ఉంది" అని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. నాగ్‌పూర్– బిలాస్‌పుర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సగటు ఆక్యుపెన్సీ 55 శాతంగా ఉంది. ఈ రూట్‌లో ప్రయాణ సమయం 5.30 గంటలుగా ఉంది. ఒకవేళ ఈ రూట్లో టికెట్ ధరలు తగ్గిస్తే ఆక్యుపెన్సీ రేషియో పెరుగుతుందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ రూట్లో ఛైర్ కార్ టికెట్ ధర రూ.1075 కాగా.. ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధర రూ.2045గా ఉంది. తక్కువ ఆక్యుపెన్సీ కారణంగా మే నెలలో వందే భారత్ స్థానంలో తేజస్ రైలును ఈ రూట్‌లో తీసుకొచ్చారు.

ఇక భోపాల్– జబల్‌పుర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లో 32 శాతం ఆక్యుపెన్సీ ఉంది. జబల్‌పుర్– భోపాల్ వందే భారత్ ఆక్యుపెన్సీ రేషియో 36శాతంగా ఉంది. ఈ రూట్‌లో కూడా టికెట్ ధరలు తగ్గించే అవకాశం ఉంది. ఈ రూట్లో టికెట్ ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1055 కాగా.. ఎగ్జిక్యూటివ్ ధర రూ.1880గా ఉంది.

### టాప్ ఆక్యుపెన్సీ రూట్లు ఇవే..

ఆక్యుపెన్సీ విషయంలో కాసర్‌గోడ్–త్రివేండ్రం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్రస్థానంలో ఉంది. 183 శాతం ఆక్యుపెన్సీతో అన్ని రైళ్ల కంటే ముందుంది. త్రివేండ్రం– కాసర్‌గోడ్ (176 శాతం), గాంధీనగర్– ముంబయి సెంట్రల్ (134 శాతం), ముంబయి సెంట్రల్ – గాంధీనగర్ (129 శాతం), వారణాశి – న్యూదిల్లీ (128 శాతం), న్యూదిల్లీ – వారణాశి (124 శాతం), దేహ్రాదూన్– అమృత్‌సర్ (105 శాతం), ముంబయి– షోలాపూర్ (111 శాతం), షోలాపూర్– ముంబయి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (104 శాతం) ఆక్యుపెన్సీ పరంగా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒక స్టేషన్ నుంచి ఒక స్టేషన్‌కు తీసుకునే టికెట్‌ను ఒక బుకింగ్‌గా, అక్కడి నుంచి మరో స్టేషన్ వరకు టికెట్ జారీ అయితే రెండో బుకింగ్‌గా లెక్కిస్తారు.

## నెగెటివ్‌లోకి సునాక్ ఆమోద రేటింగ్.. పీఎం పదవి చేపట్టిన తర్వాత మొదటిసారి



లండన్: గత ఏడాది చివర్లో బ్రిటన్ ప్రధానిగా నియమితులైన రిషి సునాక్ కు ఆదరణ తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఆ పదవి చేపట్టిన తర్వాత నుంచి మొదటిసారి ఆయన నెగెటివ్ అప్రూవల్ రేటింగ్‌ను పొందడం గమనార్హం. తాజాగా కన్జర్వేటివ్ హోంపోల్‌లో ఈ విషయం వెల్లడైంది. ఈ నెలవారీ సర్వే ప్రకారం.. గత నెల సునాక్ రేటింగ్ 11.7 శాతంగా ఉండగా.. అది ఇప్పుడు -2.7కు పడిపోయింది. ప్రధాని పదవి స్వీకరించిన సమయంలో ఆయన ఆమోద రేటు 49.9 శాతంగా ఉంది. ఆ తర్వాత మొదటిసారి ఇప్పుడే నెగెటివ్‌లోకి వెళ్లిపోయారు. శరణార్థులను రువాండాకు పంపే ప్రణాళికకు కోర్టులో ఎదురుదెబ్బ తగలడం, అలాగే వడ్డీ రేట్లను ఐదు శాతం పెంచాలన్న ఇంగ్లండ్ బ్యాంక్ నిర్ణయం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తోంది. అయితే సునాక్‌కు ఊరటనిచ్చే విషయం ఏంటంటే.. రేటింగ్ పరంగా మాజీ ప్రధానులు బోరిస్ జాన్సన్, థెరిసా మే కంటే మెరుగ్గా ఉన్నారు. ఒక దశలో జాన్సన్ రేటింగ్ -33.8కి తగ్గగా, థెరిసా మే రేటింగ్ -51.2కి పడిపోయింది. సునాక్‌తో పాటు మరో ఎనిమిది మంది కేబినెట్ సహచరులకు నెగెటివ్ రేటింగే వచ్చింది. అయితే రక్షణ శాఖ మంత్రి బెన్ వాల్లెస్‌కు అత్యధిక ఆమోద రేటింగ్ లభించింది. అది 77.1 శాతంగా ఉంది. విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీ(54.4), హోం మంత్రి సుయెల్లా బ్రేవర్మన్(30.4) రేటింగ్ సునాక్ కంటే ఎంతో మెరుగ్గా ఉన్నారు. బ్రిటన్‌కు అక్రమంగా వలస వచ్చేవారిని ఆఫ్రికా దేశమైన రువాండాకు తరలించడం తన కల అని, వీసా కాలపరిమితి మించి బ్రిటన్‌లో ఉంటున్న వారిలో భారతీయులే అత్యధికులని పేర్కొంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే సుయెల్లా రేటింగ్ పరంగా సునాక్ కంటే ఎంతో ముందు ఉండటం గమనార్హం.

## కవి సమయం

### నకిలీ ప్రేమ

యువత అంతా ప్రేమ అనే దీపం చుట్టూ
మిణుగురు పురుగుల వలే భ్రమణం
కని పెంచిన తల్లిదండ్రులను సైతం మోసం చేస్తూ
విద్య,విజ్ఞానాలను పంచే సరస్వతి ఆలయాలను
ప్రేమ కార్యాల పేరిట అపవిత్రం చెయ్యడం ఎంత ఘోరం ?
వీరిది ప్రేమ కాదు , ఇన్ ఫాచ్యుయేషన్ మాత్రమే
అశాశ్వతమైన శారీరక అందాల ఆకర్షణలో పడి
అదే ప్రేమనే భ్రమలో బ్రతుకుతూ
విలువైన కాలాన్ని, శక్తినీ వృధా చేసుకుంటూ
కలల ప్రపంచంలో బ్రతకడం బాధాకరం
విలువైన నిజాన్ని తెలుసుకున్న నాటికి
స్వప్న సౌధం కూలిపోయి భవిష్యత్తు
అంధకార బంధురమై అంతా అగమ్యగోచరం గా అనిపించును
అప్పటికే చేజారిపోయిన జీవితాన్ని చూసుకుంటూ
దు:ఖించడం తప్ప చేయగలిగిందేమియూ లేదు.

కవిత రచన :
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : ఆషాడ; తిథి:తదియ మ.10.38; శ్రవణం ఉ.7.20; వ.ఉ.11.03ల 12.32

గురువారం 06-07-2023

a **మేషం** : ప్రియతముల రాకపోకలు పెరుగుతాయి. ముఖ్యులలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. మీ సంతానం ఆరోగ్యంలో, విద్యా విషయాల గురించి ఆలోచిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. ప్రయాణాలలో చికాకులు తప్పవు. కార్మికులకు అధిక శ్రమ, చికాకు, త్రిప్పట తప్పదు. కొన్ని వార్తలు మీకు ఆందోళన కలిగిస్తాయి. b **వృషభం** :నూతన వ్యాపారాలు కొనసాగిస్తారు. చేపట్టిన పనులను నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. ఇతర దేశాలు వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధుమిత్రులలో గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్పెక్యులేషన్ చేసే వారికి మెలకువ అవసరం. సినిమా రంగాల్లోని వారికి సంతృప్తి కానవస్తుంది. పాత సమస్యలు పరిష్కార మార్గంలో నడుస్తాయి. c **మిథునం** : మిమ్మల్ని చూసి ఈర్ష్య పడేవారు అధికంగా ఉన్నారని గమనించండి. హోటల్, తినుబండారాల వ్యాపార రంగాలలోని వారికి అనుకూలమైన రోజు కాదు. సంఘంలో గుర్తింపు, రాణింపు లభిస్తుంది. వ్యవసాయ, తోటల రంగాలలోని వారికి కలసివచ్చును. అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ వహించండి. నిర్మాణ పథకాలలో జయం చేకూరును. d **కర్కాటకం** :గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్త్రీలకు మూలక సమస్యలు తలెత్తవచ్చు, జాగ్రత్త వహించండి. పూర్వపు పరిచయ వ్యక్తుల కలయిక సంతృప్తినిస్తుంది. దైవ దర్శనం చేసుకొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. కళాకారులకు గుర్తింపు లభిస్తుంది. గత స్మృతులు జ్ఞప్తికి వస్తాయి. ఇంజనీరింగ్, వైద్య రంగాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. e **సింహం** : ఉద్యోగస్తులకు పురోభివృద్ధి కానవచ్చినా.. కొంతమంది మాటతీరు, కొన్ని వార్తలు మీకు ఆందోళన కలిగిస్తాయి. రాజకీయాలలోని వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించండి. నిర్మాణ పథకాలలో జయం చేకూరుతుంది. భాగస్వామి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. కుటుంబీకుల మధ్య కొత్త కొత్త విషయాలు చర్చకు వస్తాయి. f **కన్య** : సాహిత్య సదస్సులలోను, బృంద కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. మీ చుట్టుప్రక్కల వారిలో మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. సిమెంటు, ఇసుక, ఇటుక, తాపీ పనివారికి అభివృద్ధి. ఊహించని ఖర్చులు మీ అంచనాలు దాటినా మిత్రుల సహాయ సహకారాల వల్ల సమసిపోతాయి. నిరుద్యోగులు ఉద్యోగానికై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. g **తుల** : కుటుంబ సభ్యుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. ఆర్థిక విషయాలలో చురుకుదనం కానవస్తుంది. ప్రైవేటు సంస్థలలోని వారు, సహకార సంఘాలలోని వారు పనిలో ఏకాగ్రత వహించలేక పోవడంవల్ల అధికారులతో మాటపడాల్సి వస్తుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. అన్ని రంగాలలోని స్త్రీలకు చాలా యోగప్రదంగా ఉండగలదు. h **వృశ్చికం** : బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో మెలకువ వహించండి. ఇతరుల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోకండి. శత్రువులపై విజయం సాధిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తికరంగా సాగుతాయి. తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కోక తప్పదు. i **ధనుస్సు** : క్రీడలపట్ల ఆసక్తి పెరుగుతుంది. విదేశాలు వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. స్టాకిస్టులకు, బ్రోకర్లకు, ఏజెంట్లకు అనుకూలం. పారిశ్రామిక రంగంలోని వారికి సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి. బిల్లులు చెల్లించగలుగుతారు. ప్రయత్నాలలో ఒకరి వైఖరి ఆందోళన కలిగిస్తుంది. పూర్వ పరిచయ వ్యక్తుల కలయిక సంతృప్తినిస్తుంది. j **మకరం** :నూతన పెట్టుబడలకు అనుకూలమైన కాలం. స్టేషనరీ రంగాలలో వారికి నిరుత్సాహం, క్రయ విక్రయదార్లకు యోగప్రదంగా ఉండగలదు. బంగారు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు అనుకూలమైన కాలం. మీ వ్యక్తిగత విషయాలు బయటికి తెలియకుండా గోప్యంగా ఉంచండి. ప్రచురణ, పత్రికా రంగంలోని వారికి మందకొడిగా ఉండగలదు. k **కుంభం** :మీ ఆంతరంగిక సమస్య లకు పరిష్కారమార్గం కానవస్తుంది. ఆర్థిక విషయాలలో ఒక అడుగు ముందుకు వేస్తారు. విద్యా, సాంస్కృతిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. భాగస్వాములు ఆసక్తికరమైన విషయాలను చర్చిస్తారు. ఐరన్, ఆల్కహాల్ వ్యాపారస్తులకు మిశ్రమ ఫలితం. వస్త్ర వ్యాపారస్తులకు గుర్తింపు, రాణింపు లభిస్తుంది. L **మీనం** :ప్రియతములలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. వాహన చోదకులకు ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉంది, జాగ్రత్త వహించండి. కాంట్రాక్టర్లకు నూతన ఒప్పందాలు అనుకూలిస్తాయి. పండ్ల, పూల, కూర వ్యాపారస్తులకు మిశ్రమ ఫలితం కానవస్తుంది. కళంకారీ రంగాలలోని వారికి అభిమాన బృందాలు పెరుగుతాయి. నిరుద్యోగులు స్థిరపడే రోజు.

## సంకీర్తన

# సంపదలను ప్రసాదించే శివుడు



జీవితాన్ని ఆర్థిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్థిక పరిస్థితితో ముడిపడి లేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయట పడటానికి ఆర్థిక పరిస్థితి బాగా ఉండవలసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపదలను కూడా భగవంతుడిని కోరుతుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమశివుడిని పూజించడం వలన ఫలితం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

## ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి. అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని .. సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచిదని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన .. ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు .. ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు .. ఆపదలు అతలాకుతలం చేస్తుంటాయి. అందువలన అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



# స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిర్లక్ష్య విడనాడి

## కార్మిక సంక్షేమంపై కృషి చేయాలి




గాజువాక (విజయభాను న్యూస్) : స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిర్లక్ష్యం విడనాడి కార్మిక సంక్షేమంపై కృషి చేయాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్లో బుధవారం జరి గిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత గుర్తింపు యూనియన్ చేసిన త ప్పులనే ప్రస్తుత గుర్తింపు యూనియన్ చేసి యాజమాన్యంకు కొమ్ము కాసు బిన్నాయని, దీంతో కార్మిక సమస్యలు పరిష్కారం కాక కార్మిక వర్గం తీవ్ర ఇబ్బం దులు పడుతుందన్నారు. కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. వేతన సవరణ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరు గుతుందని, ఈ విషయంపై మాత్రం ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో...

అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు బీఎన్. రాజు, బీఎంకె. నాయక్, బి.జగదీష్, కొమ్ము ప్రసాద్, గొందేశి ప్రభాకర్రెడ్డి, జీవీ.సుబ్బయ్య, మింది దేమ ఎదు, గంగవరం గోపి పాల్గొన్నారు.

# అల్లూరి జీవిత ఘట్టాలు రాసిన వర్మకు పురస్కారం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : జీవిత ఘట్టాలు ఎవరికీ తెలియని అంశాలను వెలుగులోకి తీసుకుని వచ్చిన భీమిలి కి చెందిన ప్రముఖ రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ ను విజయవాడ లో మంగళవారం జరిగిన 125 వ అల్లూరి జయంతి సభలో టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వైసిపి, బిజెపి, సీపీఐ, జనసేన, లోక్ సత్తా తదితర పార్టీల రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో వర్మ ను సన్మానించి మెమెంటో బహూకరించారు. అల్లూరి సీతారామరాజు ను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం పారిపోతుండగా కాల్చివేసినట్లు బ్రిటిష్ ప్రభుత్వం చెప్పిందనీ కానీ మంప గ్రామస్తులు అల్లూరి గుండెలపై తుపాకీ గుళ్ళు ఉన్నాయనీ చెప్పారనీ ఇలాంటి ఎన్నో అల్లూరి జీవిత ఘట్టాలు ఎవరికి తెలియని అంశాలు వెలుగులోకి తీసుకుని వచ్చినందుకు వర్మను అభినందించారు. ఉపాధ్యాయుడిగా రచయితగా మరిన్ని విజ యాలు సాధించాలని కోరారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ వర్మ గతంలో ముగ్గురు ముఖ్యమంత్రులతో పురస్కారాలు పొందారు. సీనియర్ జర్నలిస్ట్ గా ఎన్నో మానవీయ కథనాలు వెలుగులోకి తెచ్చారు. భీమిలి లో వర్తమాన రచయితల సంఘానికి అధ్యక్షునిగా వున్నారు. గత కొన్ని ఏళ్లుగా ఉపాధ్యాయ సంఘాలు అధ్యక్షుడు గా ఉన్న ఈయన ప్రస్తుతం పి.ఆర్.పి.యూ టీచర్ల సంఘానికి విశాఖ జిల్లా అధ్యక్షునిగాకూడా వున్నారు. అల్లూరి పరిశోధన కథనాలు అన్ని రాజకీయ పార్టీల నాయకుల ప్రశంసలు పొందడం పట్ల భీమిలి ప్రజలు అభినందిస్తున్నారు.

# దేశాన్ని విచ్ఛినం చేస్తున్న

## బీజేపీ... ఆర్ఎస్ఎస్ మూకలు

**- జగన్ పాలనలో రాష్ట్రం తిరోగమనం - సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు**



రాజమండ్రి (విజయభాను న్యూస్) : దేశాన్ని మతం పేరుతో ప్రజల మధ్య వైశమ్యాలు రెచ్చగొడుతూ బిజెపి మరియు ఆర్ఎస్ఎ మూకలు దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు బుధవారం ఉదయం స్థానిక జట్లు సంఘము కార్యాలయములో మేస్త్రిల సమావేశము జరిగింది దీనికి సంఘము అధ్యక్షులు కుండ్రపు రాంబాబు అధ్యక్షత వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.... కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది మొదలుకొని నేటి వరకు ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తూ వస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను సర్వనాశనం చేసిందని ఇతర పార్టీల్లో గెలిచిన వాళ్లను తమ పార్టీలో చేర్చుకొని వారి పార్టీని అ ప్రజాస్వామ్య పద్ధతిలో విస్తరించు కుంటు న్నారని దేశ వ్యాపితంగాఉన్న మీడియా సంస్థలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన పత్రికా స్వేచ్ఛను హరించి వేశారని, సోషల్ మీడియాలో తమకు నచ్చని వారిపై విషంగక్కుతున్నారని, భారత జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సే కు గుడి కట్టేందుకు సైతం వెనుకాడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ ప్రజలకు ఇచ్చిన కొన్ని వాగ్దానాలు మరిచిపోయారని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోసారి బిజెపి ప్రభుత్వం కేంద్రంలోఅధికారంలోకి వస్తే రాచరిక పరిపాలన కొనసాగిస్తారని, రానున్న శాసనసభ ఎన్నికల్లో బిజెపిని నిలువరించే లౌకిక పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని అన్నారు. జగన్ అధికారం లోకి వచ్చిన తరువాత కొత్త పరిశ్రమలు ఒక్కటి రాలేదని వున్నా పరిశ్రమములు వేరే రాష్ట్ర లకు తరలి పోయని దీనితో రాష్ట్రము తీరోగమనం గా రాష్ట్రము ప్రణాస్తుందని అన్నారు సంక్షేమ పథకాలు ను ఎవ్వరు తప్పుపట్టడం లేదని కానీ నిరోద్యగం తాండవిస్తుంది అని ఉపాధి లేక యువత వేరే రాష్ట్రాలకు తరలి పోతున్నారని మధు అన్నారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా సిపిఐ నాయకత్వంలో త్వరలో బస్సు యాత్ర జరుగు తుందని అన్నారు. ఈ సమావేశము జట్ల సంఘము కార్యదర్శి సప్పా రమణ, ఉపాధ్యక్షులు పి.దేముడు వెంకట్రావు దురపసాద్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నల్ల రామారావు, కోశాధికారి కాళ్ళ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారింది : మాజీ మంత్రి కోండ్రు



రాజాం (విజయభాను న్యూస్) : నెల్లిమర్ల నియోజక వర్గంలో భవిష్యత్తు గ్యారంటీ చైతన్య రథం బస్సు యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీ మోహన్. బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా శకపురుషుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.వైసీపీ ప్రభుత్వం పాలనలో నిరుద్యోగ యువతీ యువకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైసీపీ పాలనలో రాష్ట్రం గాడితప్పిందన్నారు.అడ్డగోలుగా నిత్యావసర ధరలు. ఇసుకమాఫియా. రాష్ట్రంలో తీవ్రమైన తాగునీటి సమస్య.రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు. చంద్రబాబు చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, విద్యుత్ సంస్కరణలు దేశానికి నూతన మార్గ నిర్దేశనం చెయ్యటమే కాకుండా,చంద్రబాబు నోట ముందుగా వచ్చిన సంపద సృష్టి అన్న పదం రాజకీయ నేతలనే కాదు ఆర్థికవేత్తలను. పారిశ్రామికవేత్తలను సైతం ఆకర్షించచిం దన్నారు. గ్రామాభివృద్ధికోసం రాష్ట్రానికి కేటాయించిన కేంద్రం నిధులను వైసీపీ ప్రభుత్వం దారిని మల్లించడం తో పాటు గ్రామాలు అభివృద్ధికి నోచుకోక కుంటి పడ్డాయన్నారు.75% పోలవరాన్ని పూర్తిచేస్తే కనీసం 10% పనులు కూడా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి చెయ్యలేకపోయారని మండిపడ్డారు.వైసీపీ ప్రభుత్వం లో రైతులకు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడే మళ్లీ మంచిరోజులు వస్తాయన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు కాని హామీలు,మోసకారి మాటలతో ప్రజలను నట్టేట ముంచారన్నారు. ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్.మెగా డీఎస్సీ అంటూ ప్రగల్బాలు పలికి నిరుద్యుగులను మోసం చేశారన్నారు.వైసీపీ ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జనవరి 1 న జ్యాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్బాలు పలికిన జగన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక.రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక.స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం అందక రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిం దన్నారు. ఉపాధి.ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పడాన్ని కోండ్రు గుర్తుచేశారు.తెలుగుదేశం పార్టీ హయాంలో పరిశ్రమల ద్వారా 5.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించా మన్నారు. కానీ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, కమీషన్ల కక్కుర్తితో మూడున్న రేళ్లలో 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అమరావతి నిర్మాణంతో 15 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్ రెడ్డి అమరావతిని సైతం నిర్వీర్యం చేశారన్నారు.టీడీపీ హయాంలో 2 సార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలిచ్చామన్నారు. కానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్న జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు.ఐటి అభివృద్ధితో 34 వేల ఉద్యోగాలు.స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా 64,000 ఉద్యోగాలిచ్చామని జగన్ రెడ్డి ఐటి కంపెనీలు తరిమేసి అక్రమ కేసులతో స్కిల్ డెవలప్మెంట్ ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు.నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తానన్న జగన్ రెడ్డి ఎన్ని కాంట్రాక్టులిచ్చారని ఎంతమందిని కాంట్రాక్టర్లుగా తయారు చేశారని నిలదీశారు.

చంద్రబాబు నాయుడు ప్రతినెల 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రెండువేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తే జగన్ రెడ్డి దాన్ని రద్దు చేశారని.ఎస్సీ.ఎస్టీ.బీసీ. మైనార్టీ.కాపు కార్పోరేషన్ల యువతకు సబ్సిడీ బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి కల్పిస్తే జగన్ రెడ్డి రద్దు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టారని ఘాటుగా విమర్శించారు .కేంద్రం మెడలు వంచి సాధిస్తానన్న ప్రత్యేక హోదా ఏమైందో చెప్పాలని కోండ్రు సీఎం జగన్ మోహన్ రెడ్డిని డిమాండ్ చేశారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర సంక్షేమం అని అన్నారు, ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# భీమిలి డైట్ కళాశాల ప్రధానాచార్యులుగా ఎల్.సుధాకర్



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : అదనపు భాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఇటీవల కాలం వరకు పనిచేసిన మాణిక్య నాయుడు బదిలీపై విజయనగరం డైట్ కళాశాలకు బదిలీ అయ్యారు. బుధవారం పాఠశాల విద్యా కమీషనరు నుండి నియామక పత్రం అందజేశారు ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ కు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఆచార్యులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నా వంతు కృషితో పాటుగా మీ అందరి సహాయ సహకారాలు అవసరమని కళాశాలని విద్య ప్రగతిలో ముందుకు తీసుకెళ్లేందుకు తోడ్పడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు త్రినాధ రావు మాధవి, అలావుద్దీన్, హరిణి, సూపర్డెంట్ శిరీష సిబ్బంది పాల్గొన్నారు.



**ఉత్తరంధ్ర ఇంఛార్జ్ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ని విశాఖ విచ్చేసిన సందర్భము గా విశాఖ రైల్వే స్టేషన్ లో మర్యాద పూర్వకముగా కలిసిన విల్లూరి భాస్కరరావు 35 వ వార్డ్ వైసీపీ కార్పొరేటర్ జీవీఎంసీ విఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్**

# డి.ఎల్.ఆర్ నమోదు సమర్ధవంతంగా నిర్వహించాలి

## జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

శ్రీకాకుళం (విజయభాను న్యూస్) : డి.ఎల్.ఆర్ నమోదు సమర్ధవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అన్నారు.బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్వే డి.టిలతో రీ సర్వే టీం వర్క్ లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహనా సదస్సు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జాయింట్ కలెక్టర్ సర్వే డి.టిలకు పలు సూచనలు చేశారు. కేటగిరీల వారీగా ఎలా నమోదు చేయాలి వాటిలో ఉన్న లోటుపాట్లు పట్టిక ద్వారా ఎలా నమోదు చేయాలి అన్న పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సందేహాలను నివృత్తి చేస్తూ, పలు సూచనలు చేశారు. రీ సర్వే నమోదులో వచ్చిన లోటుపాట్లు ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ వేగవంతంగా పూర్తి చేయాలని అందరూ అవగాహనతో ఉంటే రీ సర్వే నమోదు ప్రక్రియ పురోగతి సాధించడం సులభతరమన్నారు. ఈ అవగాహనా సదస్సులో సర్వే డి.టిల తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యత పరిశీలించాకే సత్యగిరికి సరకులు

అన్నవరం (విజయభాను న్యూస్) : అన్నవరం దేవస్థానంలో స్వామివారి ప్రసాదం, నిత్యాన్నదానం తయారీలో వినియోగించే సరకుల నాణ్యతను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే దిగుమతి చేసుకోవాలని ఈవో చంద్రశేఖర ఆజాద్ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సత్యదేవుని ప్రసాదం, అన్న ప్రసాదాలు రుచికరంగా ఉండాలంటే నాణ్యమైన సరకులను మాత్రమే గుత్తేదారు సరఫరా చేయాలని, వాటిని పరిశీలించిన తర్వాతే దిగుమతి చేసుకునేలా ఆయన చర్యలు చేపట్టారు. సరకులను ఫుడ్ ఇన్స్పెక్టర్ ముందుగా తనిఖీచేసి సంతృప్తి వ్యక్తంచేసిన తర్వాతే దేవస్థానం గోదాములోకి అనుమతించాలని వెల్లడించారు. ఇకపై ఆలయానికి వచ్చే శనగపప్పు, కందిపప్పు, బియ్యం, కిస్మిస్, యాలకులు, జీడి పప్పు, చింతపండు, గోధుమలు, పంచదార, నెయ్యి, సన్ఫ్లవర్ ఆయిల్ తదితర సరకుల్లో నాణ్యతను ముందుగానే పరిశీలిస్తారు. ఇదే విషయమై గుత్తేదారు సరఫరా చేసే సరకుల నాణ్యత పరిశీలన చేయాలని జారీచేశారు.

# తను నా మనసుకు ఎంతో దగ్గరయ్యాడు – హీరోయిన్ తమన్నా



"విజయ్ నా అభిప్రాయాలను గౌరవిస్తాడు. అందుకే తను నా మనసుకు ఎంతో దగ్గరయ్యాడు " అని తమన్నా తన ప్రియుడి గురించి తెలిపారు. ఇటీవల రెండు వెబ్‌సిరీస్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన హీరోయిన్ తమన్నా ... వీటి ప్రమోషన్స్‌లోనే తన ప్రేమ వివరాలు వెల్లడించారు."విజయ్ వర్మ నా జీవితంలోకి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నా భావాలకు గౌరవించే అద్భుతమైన వ్యక్తి. అతడి జీవితాన్ని ఎంతో మంది మహిళలు ప్రభావితం చేశారని నేను భావిస్తాను. అతడు తన కుటుంబంలోని స్త్రీలపై ఎంతో ప్రేమాభిమానాలను చూపుతాడు. ఇంట్లో వారిపై గౌరవంతో ఉండేవారు.. బయట మహిళలతో కూడా ఎంతో మర్యాదగా వ్యవహరిస్తారని నా నమ్మకం. ఇది నేటితరం యువత నేర్చుకోవాలి. స్త్రీలతో ఎలా మెలగాలో తల్లిదండ్రులు వారి కుమారులకు నేర్పాలి. ప్రతి విషయంలోనూ మహిళలు రాజీపడాలనే భావనలను నేను అంగీకరించను. ఇక విజయ్ నా అభిప్రాయాలను గౌరవిస్తాడు. అందుకే తను నా మనసుకు ఎంతో దగ్గరయ్యాడు " అని తమన్నా తెలిపారు. హీరో లను సూపర్‌స్టార్స్ అంటారు.. హీరోయిన్లపై విమర్శలు కురిపిస్తారు : తమన్నా తాను నటించిన వెబ్‌సిరీస్‌లను చూసి పలువురు విమర్శించడం గురించి తమన్నా మాట్లాడారు. ఈ తరం వాళ్లు కూడా తనను వ్యతిరేకిస్తారని అనుకోలేదని అసహనాన్ని వ్యక్తం చేశారు. హీరోలు ఎలాంటి పాత్రల్లో నటించినా సూపర్‌స్టార్స్ అంటూ ప్రశంసిస్తారని.. కానీ, హీరోయిన్స్ నటిస్తే మాత్రం విమర్శలు కురిపిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కెరీర్‌పరంగా ముందుకు వెళ్లాలంటే కొన్ని నిర్ణయాలను మార్చుకోవాలని తమన్నా అభిప్రాయ పడ్డారు.

# టైమ్స్ స్క్వేర్‌లో సితార

హీరో మహేష్ బాబు కూతురు సితారకు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. ఈ నేపథ్యంలో ప్రముఖ బంగారు నగల తయారీ సంస్థ పిఎంజె జివెల్స్ ప్రత్యేకంగా సితార కలెక్షన్ పేరుతో ఓ స్పెషల్ బ్రాండ్‌ని రూపొందించింది. రీసెంట్ గానే దీనికి సంబంధించిన యాడ్‌ను షూట్ చేశారు. కాగా.. ఇప్పుడు ఈ యాడ్‌కు సంబంధించిన ఫొటోలను ప్రెస్టీజియస్ న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శించారు. దీనికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంత చిన్న వయసులోనే సితార ఇలాంటి ఘనత సాధించడంతో మహేష్ మురిసిపోయారు. సితారను చూస్తే గర్వంగా ఉందని ఈ ఫొటోలను అభిమానులతో పంచుకున్నాడు.





# సినీ ప్రియులకు నిఖిల్ క్షమాపణలు.. కారణం ఏమిటంటే..?



కార్తికేయ 2' తర్వాత దేశవ్యాప్తంగా విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు నటుడు నిఖిల్ ఆయన నటించిన సరికొత్త చిత్రం 'స్పై' . ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈసినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. తన సరికొత్త చిత్రం 'స్పై' (ఫలితంపై నటుడు నిఖిల్ స్పందించారు. దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు క్షమాపణలు చెప్పారు. ఈ సినిమా విషయంలో జరిగిన తప్పు భవిష్యత్‌లో రిపీట్ కాకుండా చూసుకుంటానని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ట్విటర్ వేదికగా ఓ బహిరంగ ప్రకటన విడుదల చేశారు. "నేను నటించిన సరికొత్త 'స్పై' చిత్రాన్ని ఆదరించి.. నా కెరీర్‌లోనే అత్యధిక బాక్సాఫీస్ ఓపెనింగ్స్ కలెక్ట్ చేసిన సినిమాగా నిలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నాపై మీరు పెట్టుకున్న నమ్మకాన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. కాంట్రాక్ట్/ కంటెంట్ ఆలస్యమైన కారణంగా దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో మా సినిమా విడుదలను నిలిపివేశామని చెప్పడానికి బాధపడుతున్నా. ఓవర్సీలోనూ తెలుగు ప్రీమియర్‌కు సంబంధించి 350 షోలు రద్దయ్యాయి. కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషలకు చెందిన ప్రేక్షకులకు క్షమాపణలు చెబుతున్నా. 'కార్తికేయ 2' తర్వాత నేను ఓకే చేసిన మూడు ప్రాజెక్టులను పర్‌ఫెక్ట్‌గా సిద్ధం చేసి.. సరైన సమయంలో అన్ని భాషల్లో విడుదల చేసేలా చూస్తానని అప్పుడు అందరికీ మాటిచ్చా. కాకపోతే, కొన్ని కారణాల వల్ల అది ఇప్పుడు జరగలేదు.

తెలుగు చిత్రాలను ఆదరించే వారందరికీ మరోసారి మాటిస్తున్నా. ఇకపై నాణ్యత విషయంలో రాజీపడను. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సినిమా పూర్తయ్యాక అన్ని విధాలుగా చెక్ చేసి.. మంచి ప్రాజెక్ట్‌ను మీకు అందిస్తాను" అని నిఖిల్ తెలిపారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం వెనుక రహస్యాన్ని స్పృశిస్తూ.. ఓ గూఢచారి కథతో రూపొందిన చిత్రమే 'స్పై'. నిఖిల్, ఐశ్వర్య మేనన్, మకరంద్ దేశ్ పాండే, ఆర్యన్ రాజేశ్ కీలక పాత్రలు పోషించారు. ఎడిటర్ గ్యారీ బీహెచ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది.


# విడాకులు తీసుకున్న నిహారిక జంట



నటి నిహారిక కొణిదెల, చైతన్య జొన్నలగడ్డ తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. వారిద్దరూ పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకున్నారు. గత కొన్నిరోజులుగా నిహారిక వేడుకలకు.. భర్తతో కాకుండా నిహారిక తాను మాత్రమే హాజరు అవుతుంది. దీంతో భర్తకు విడాకులు ఇచ్చిందంటూ టాలీవుడ్‌లో ప్రచారం సాగింది. మరోవైపు చైతన్య జొన్నలగడ్డ కూడా సోషల్‌మీడియా ఖాతా నుంచి నిహారికతో కలిసి ఉన్న ఫొటోలను, వారి పెళ్లి ఫొటోలను గత కొన్నిరోజుల ముందు తొలగించడంతో ఈ వార్తలకు బలం చేకూరింది.కాగా, విడాకులు తీసుకునేందుకు చైతన్యనే ముందుగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో దరఖాస్తు చేసుకున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే నిహారిక తరపున విడాకుల కోసం పిటిషన్ వేసింది నాగబాబుకు సన్నిహిత అడ్వకేట్ అయిన కళ్యాణ్ దిలీప్ సుంకర తెలుస్తోంది. నెలరోజుల కిందటే కోర్టు ఈ జంటకు మంజూరు చేసింది.

నాగబాబు కుమార్తె నిహారికకు, గుంటూరు ఐజీ జె. ప్రభాకర్‌రావు కుమారుడు చైతన్య జొన్నలగడ్డకు 2020 డిసెంబర్‌లో వివాహమైంది.

# సినిమాలకు బ్రేక్ ఇవ్వనున్న సమంత..



స్టార్ హీరోయిన్ సమంత కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమాలకు ఏడాది పాటు బ్రేక్ ఇవ్వనుందట. ఇటీవల 'శాకుంతలం'తో పలకరించిన ఆమె ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'ఖుషి'లో నటిస్తోంది. అలాగే 'సిటడెల్' వెబ్‌సిరీస్‌తో బిజీగా ఉంది. ఈ రెండూ పూర్తయ్యాక ఆమె ఓ ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. సమంత కొన్ని రోజులుగా 'మయోసైటిస్'కు చికిత్స తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి పూర్తిగా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని.. దానికి అవసరమైన అదనపు చికిత్స తీసుకోవడం కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే ఖుషి, సిటాడెల్ కాకుండా ఇతర ప్రాజెక్టులు ఏవీ ఓకే చేయలేదట. గతంలో అంగీకరించిన కొన్ని సినిమాలకు సంబంధించిన అడ్వాన్సులను కూడా సమంత తిరిగి నిర్మాతలకు ఇచ్చేసిందని టాక్. ప్రస్తుతం సమంత 'ఖుషి' షూటింగ్‌లో ఉంది. మరో మూడు రోజుల్లో దీని చిత్రీకరణ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా సెప్టెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సమంత ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొటుందో లేదో చూడాలి.

# దేవదాసు హిట్ అయింది కదాని!





సాధారణంగా ఏ సినిమా ముగింపునకు అయినా శుభం కార్డు పడితేనే ప్రేక్షకుడి మనసు గెలిచినట్లు. శుభంగా పూర్తయితే కామెడీ అని, నాయికానాయకులు మరణిస్తే ట్రాజడీ అనీ అంటారు. సుఖాంతం, దుఃఖాంతం అన్నమాట. 'దేవదాసు', 'లైలామజ్ను'లాంటివి కొన్ని సినిమాలు దుఃఖాంతం. అలా అయితే ప్రేక్షకులు హర్షించరనీ, సుఖాంతంగానే ఉండాలనీ దర్శక–నిర్మాతలు ఆలోచిస్తారు. దుఃఖాంతం అయినా 'దేవదాసు' విజయవంతమైందని, 'చిరంజీవులు' తీస్తే ఆడలేదు. 'లైలా మజ్ను'లో నాయికనాయకులు ఎడారి తుపానుకి మరణిస్తారు. కానీ, ఇద్దరూ స్వర్గంలో కలుసుకున్నట్టు పాట పెట్టి సుఖాంతపు ముగింపు ఇచ్చారు. ఇలాంటి సందిగ్ధాల్లో కొందరు రెండు ముగింపుల్లా తీస్తారు.'అమావాస్య చంద్రుడు' సినిమా సుఖాంతమే. కానీ, ప్రేమికులిద్దరూ విడిపోతే ఎలా ఉంటుందన్న ఆలోచనతో నిర్మాత కమల్‌హాసన్, దర్శకుడు సింగీతానికి వచ్చింది. దీంతో రెండు వెర్షన్‌లూ తీశారు. ఆ రెండు వెర్షన్లూ చూసిన సినీ పెద్దలు, సుఖాంతమే బాగుందన్నారు. గొప్ప దర్శక నిర్మాత ఎల్.వి.ప్రసాద్ కూడా ఆ మాటే అన్నారట. ఆయన అందులో అన్యమత ప్రేమని సమర్థించే పాత్ర ధరించారు. అందుకే ఆ సినిమాని సుఖాంతంగానే ముగించారు. తెలుగు ప్రేక్షకులు ట్రాజడీ సినిమాలను అంతగా ఇష్టపడరు. నాయికానాయకులు ఎవరైనా చనిపోతే అస్సలు ఒప్పుకోరు. మణిరత్నం తీసిన 'గీతాంజలి'లో కూడా 'ఇంకెన్నాళ్లు బతుకుతారో తెలియదు. కానీ, బతికినన్నాళ్లూ సంతోషంగా ఉంటారు' అంటూ ఆ సినిమా ముగుస్తుంది. ఇక చిరంజీవి నటించిన 'ఠాగూర్' తమిళ 'రమణ'కు రీమేక్. తమిళంలో విజయకాంత్‌కు ఉరిశిక్ష పడుతుంది. కానీ, తెలుగులో కూడా అలాంటి ముగింపే ఉంటే మరోలా ఉండేది. 'ఠాగూర్'లో చిరంజీవికి సాధారణజైలు శిక్ష మాత్రమే పడుతుంది.

# 'మంగళవారం' సినిమా టీజర్ విడుదల




అజయ్ భూపతి దర్శకత్వం వహించిన తాజా సినిమా 'మంగళవారం'. ఇందులో పాయల్ రాజ్‌పుత్ ఓ ప్రధాన పాత్రధారి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందుతోంది. ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ నేడు విడుదల చేశారు. 'మంగళవారం' టీజర్ నిడివి 60 సెకన్లకు కొంచెం ఎక్కువ. అయితే, ఆ సమయంలో అజయ్ భూపతి చాలా అంశాలు చూపించి ఆసక్తి కలిగించారు. ఊరి ప్రజలు ఏం చూస్తున్నారు? అనేది ఓ ఇంట్రెస్టింగ్ టాపిక్ అయితే... 'ఏం చూశారండీ?' అని లక్ష్మణ్ అడిగితే 'ఒరేయ్ పులి! కాసేపు నువ్వు పువ్వు మూసుకుని గమ్మున ఉండరా' అని అజయ్ ఘోష్ సమాధానం ఇచ్చారు. తుపాకీతో చైతన్య కృష్ణ గురి పెట్టడమూ చూపించారు. ఊరిలోకి పులి వచ్చిందా? లేదంటే ఏమైనా జరిగిందా? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

# టీమిండియా క్రికెటర్‌కు తప్పిన పెను ప్రమాదం



మీరట్ : టీమిండియా మాజీ క్రికెటర్ ప్రవీణ్ కుమార్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పాండవ్ నగర్ నుంచి మీరట్‌కు వస్తుండగా ప్రవీణ్ కుమార్ ప్రయాణిస్తున్న ల్యాండ్ రోవర్ కారును క్యాంటర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ ప్రయాణిస్తున్న కారు నుజ్జుగుజ్జయ్యింది. ప్రమాద సమయంలో ప్రవీణ్‌తోపాటు అతని కుమారుడు కారులో ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్యాంటర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మీరట్ సిటీ ఎంట్రెన్స్‌లో ఈ యాక్సిడెంట్ జరిగింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# 37వ సెయిలింగ్ పోటీలు షురూ



ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 37వ సెయిలింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ సెయిలింగ్‌క్లబ్‌లో ఈఎంఈ సెయిలింగ్ అసోషియేషన్(ఈఎంఈఎస్ఏ), లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను లెఫ్టినెంట్ జనరల్, లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ జేఎస్ సిడాన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెయిలింగ్ పోటీలకు హైదరా బాద్ ముఖ్యకేంద్రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 89మంది అనుభవజ్ఞులైన సీనియర్ సెయిలర్స్ పాల్గొంటున్నారని, ఆ క్రమంలో కలర్‌ఫుల్ బోట్లతో హుస్సేన్‌సాగర్ కనువిందు చేయనుందన్నారు. ఈ పోటీలు ఈనెల 9 వరకు జరగనున్నాయని చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ ఇలాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో పాల్గొనే విధంగా యువతను ప్రోత్సహిస్తున్నదని అన్నారు.

# చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్.. ఎంపికకు కారణాలు ఇవేనా..?




టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ అజిత్ అగార్కర్‌కు సెలెక్షన్ కమిటీ చీఫ్ పదవి దక్కింది. చేతన్ శర్మ రాజీనామా నేపథ్యంలో ఎవరు వస్తారా..? అనే ఎదురు చూపులకు బీసీసీఐ తెర దించింది. వీరేంద్ర సెహ్వాగ్ పేరు విస్తృతంగా వినిపించినప్పటికీ.. అనూహ్యంగా అజిత్ అగార్కర్ రేసులోకి వచ్చాడు. అతడిని చీఫ్ సెలెక్టర్‌గా బీసీసీఐ ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు జట్టును అగార్కర్ నేతృత్వంలోని కమిటీనే ప్రకటించాల్సి ఉంది. ఆసియా కప్, వన్డే ప్రపంచ కప్ వంటి టోర్నీలు ఉన్న నేపథ్యంలో కీలమైన పోస్టుకు అగార్కర్‌ను ఎంపిక చేసుకోవడానికిగల కారణాలను ఓసారి పరిశీలిద్దాం..యువ అభ్యర్థిత్వం: ఈసారి చీఫ్ సెలెక్టర్‌గా యువ అభ్యర్థిత్వం వైపు బీసీసీఐ మొగ్గు చూపింది. రాబోయే కాలంలో వన్డే ప్రపంచ కప్‌తోపాటు టీ20 వరల్డ్ కప్ జట్లను ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీంతో టీ20లు ఆడిన అనుభవం ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో అజిత్ పేరును ఆమోదించింది. అనుభవం: కేవలం మ్యాచ్‌ల అనుభవమే కాకుండా.. గతంలో ఏదైనా జట్టుకు కోచ్ లేదా సెలెక్షన్ కమిటీలో పని చేసిన అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం విశేషం.

# డిజైన్ థింకింగ్ అంశంపై 7,8 తేదీల్లో జాతీయ సదస్సు

-ఏయూ అంబేద్కర్ చైర్, ట్రాన్స్ డిపిప్లీనరీ రీసెర్చ్ హబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహణ

-హాజరు కానున్న కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి ఏ.నారాయణ స్వామి




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్, ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్‌ల సంయుక్తం నిర్వహణలో ఈ నెల 7,8 తేదీలలో డిజైన్ థింకింగ్-ట్రాన్స్-డిసిప్లీనరీ చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు వెల్లడించారు. సదస్సును శుక్రవారం ఉదయం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఏ.నారాయణ స్వామి ముఖ్య అతిధిగా హాజరై సదస్సును ప్రారంభిస్తారు. సదస్సులో ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాస రావు, ప్రముఖ డిజైన్ థింకింగ్ నిపుణులు ఇఎస్ఎస్ ఇఎన్ఎన్ సంస్థ వ్యవస్థాప సంచాలకులు సాయిరాం బొల్లాప్రగడ కీలకోపన్యాసం అందిస్తారు.సదస్సుకు దేశ వ్యాప్తంగా 886 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. సదస్సుకు 1500కుపైగా పరిశోధన పత్రాలు వచ్చాయని, వీటిలో కేవలం 452 పరిశోధన పత్రాలను ఎంపిక చేసి సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. సదస్సును 33 అంశాలపై నిర్వహిస్తున్నామన్నారు.

సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాలతో నాలుగు పుస్తకాలు తీసుకువస్తామని ఇంజనీరింగ్ విభాగంలో రెండు, ఆర్ట్స్-న్యాయ శాస్త్రాలకు , ఫార్మశీ- సైన్స్ కోర్సులకు ఒక్కో పుస్తక రూపంలో తీసుకురావడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రఖ్యాత స్ప్రింగర్ సంస్థ అత్యుత్తమ పరిశోధన పత్రాలతో ఒక ప్రత్యేక సంచికను తీసుకువస్తుందన్నారు. సంక్లిష్టమైన సమస్యలకు అత్యుత్తమ పరిష్కారాలను అందించడానికి డిజైన్ థింకింగ్ ఎంతో అవసరమని తెలిపారు.

దీనికి రానున్న కాలంలో ఎంతో ప్రాచుర్యం, ప్రాధాన్యత పెరుగుతాయని, దీనిని గుర్తించి సదస్సు అంశంగా ఎంపిక చేసామన్నారు. మానవ కేంద్రీకృత ఆలోచన విధానంగా ఇది నిలుస్తుందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం విభిన్న శాస్త్ర అంశాలలో నవ్య పరిశోధనలు జరిపే దిశగా ట్రాన్స్‌డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు.

ఏయూకు అనుబంధంగా పనిచేస్తున్న డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేస్తున్న పరిశోధన మార్గదర్శకం అందించే అర్హత కలిగిన వారిని తీసుకుని దీనిని నిర్వహించడం జరుగుతోందన్నారు.

విభిన్న శాస్త్రాలను అనుసంధానం చేసే కేంద్రంగా ఏయూ టిడిఆర్ హబ్ నిలుస్తోందన్నారు. ఇదే విధానంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నూతన విద్య విధానం 2020 ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు.

విలేకరుల సమావేశంలో అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సహ కన్వీనర్లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య బి.ముని స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 8న సీఎం జగన్ కళ్యాణదుర్గం పర్యటన

అనంతపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8వ తేదీన కళ్యాణదుర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో ఏర్పాట్లను మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషాశ్రీచరణ్, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీన కళ్యాణదుర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతు సభను విజయవంతం చేయండి. వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రభుత్వం ప్రతీ ఏటా రైతు దినోత్సవం నిర్వహిస్తోంది. కళ్యాణదుర్గం సభలో ఇన్ పుట్ సబ్సిడీని సీఎం జగన్ విడుదల చేస్తారు.

# టిడ్కో ఇండ్లను పరిశీలించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం 5వ జోన్ 45వ వార్డు పరిధిలోని తాటిచెట్లపాలెం ఎ.ఎస్.ఆర్. కాలనీలోని టిడ్కో ఇండ్లను కార్పొరేటర్ కంపా హనుక్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిర్మించిన 280 టిడ్కో ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, ఇండ్ల చుట్టూ సిసి రోడ్డు నిర్మాణం, తాగునీటి పైప్ లైన్లు పనులు చేపట్టవలసి ఉందని 15 రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని టిడ్కో హౌసింగ్ కార్య నిర్వాహక ఇంజనీరును ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఇల్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడును ఆదేశించారు. పరిసరాలలో గ్రీనరీ, విద్యుత్ దీపాలు ఏర్పాట్లు, భూగర్భ డ్రైనేజీ మొదలైనవి పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఎ.పి.డి. పద్మావతి, టిడ్కో హౌసింగ్ కార్య నిర్వాహక ఇంజనీర్, సహాయకి ఇంజనీరు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులకు తోడుగా జగనన్న సురక్ష

– రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాద రావు



(శ్రీకాకుళం,**విజయభాను న్యూస్) :** స్థానిక బాపూజీ కళా మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న పెద్ద రెల్లివీధికి చెందిన ప్రజలు పాల్గొని, తమ సమస్యలు మంత్రి ధర్మానకు విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ..జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో భాగంగా వలంటీర్లు,గృహ సారథులు, గ్రామ సచివాలయ కో – ఆర్డినేటర్లు ఇంటింటికీ వచ్చి మీతో మాట్లాడుతున్నారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు సాగనుంది. ఒకప్పుడు నిస్సహాయులు ప్రభుత్వం కార్యాలయాలకు వెళ్లాలి అంటే వెనుకడుగు వేసే వాళ్ళు. కానీ ఇవాళ పాలనను స్థానికం చేయడంతో పాటూ,మీ ఇంటి దగ్గరకే పథకాలు అందే విధంగా వలంటీర్లు కృషి చేస్తుండడం ఆనందదాయకం. అలానే వివిధ ధ్రువ పత్రాల పేరిట 11 రకాల సర్వీసులు ఈ జగనన్న సురక్ష ద్వారా నేరుగా సామాన్యుల ఇంటి వద్దకే అందనుండడం నిజంగానే పాలనలో ఓ గొప్ప మార్పు. నెల రోజుల పాటు యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం చేయనున్నాము. సీఎం జగన్ ను ఉద్దేశిస్తూ ఆయనకు అనుభవం లేదు అని మొదట్లో విపక్షాలకు చెందిన నాయకులంతా విమర్శించారు. కానీ ఇవాళ దేశంలో మిగిలిన అన్ని రాష్ట్రాలు ఆంధ్రాను అనుసరిస్తున్నా యి. ఇది మనకెంతో గర్వకారణం. ఒకప్పుడు విమర్శలు చేసిన విపక్షాలు ఇవాళ ఏం మాట్లాడాలో కూడా తెలియని అయోమయంలో ఉన్నాయి. పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తుండడంతో అవినీతి లేని వ్యవస్థల నిర్వహణ అన్నది సాధ్యం అవుతోంది. రాజన్న రాజ్యంలో సంక్షేమ పథకాల అందుకుంటున్న అందరూ కూడా దర్జాగా తీసుకుంటున్నారు. దేశానికి స్వతంత్రం వచ్చినా కూడా మాకు స్వతంత్రం లేదు అని బాధలో కొని వర్గాలు ఇంత కాలం ఉండిపోయాయి. ఇప్పటిదాకా నిరాశలో ఉన్న వారికి అండగా సీఎం జగన్ ఉన్నారు.

# పాఠశాల అదనపు అంతస్తుకు శంకుస్థాపన చేసిన నగర మేయర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పాఠశాలల అభివృద్ధితోనే ప్రగతి సాధించవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె మూడవ జోన్ పరిధిలోని 25వ వార్డు మధురానగర్ జివిఎంసి హైస్కూల్ లో నూతన అదనపు అంతస్తు నిర్మాణానికి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందా తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సుమారు రూ.36 లక్షల వ్యయంతో జివిఎంసి నిధుల నుండి 5 క్లాస్ రూములు పాఠశాలపై అదనపు అంతస్తు నిర్మించేందుకు శంకుస్థాపన చేశామన్నారు.

పాఠశాలల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధించవచ్చని విద్యార్థుల్లో సృజనాత్మకను పెంపొందిం చేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే జగనన్న ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి, పిల్లల చదువుకు ఎన్నో నిధులు ఖర్చు చేస్తున్నారని, అమ్మఒడి, మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు, బట్టలు ఇస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యా యుడు, ఉపాధ్యాయులు పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సింహాద్రి నాధునికి ఊంజల్ సేవ



సింహాచలం , (విజయభాను న్యూస్) : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారికి శ్రీ స్వామి వారి మండపంలో ఊంజల్ సేవ అత్యంత వైభవంగా వైదీకులు నిర్వహించారు. శేష శయన వాహనంపై స్వామి వారిని ఉభయ దేవేరులను అధిష్టింపచేశారు. (ఒరిస్సా దాసుడు) శ్రీ లక్ష్మి కాంత నాయాకో మరియు వారి బృందం భజనలు కీర్తనలు ఆలపించారు. స్థానాచార్యులు డా రాజగోపాల్ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు అలంకార పురోహితులు కరి సీతారామాచార్యులు ఆధ్వర్యం లో రమణీయంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. వివిధ రకాల పళ్ళు ఆరగింపు చేశారు. మండపం, స్వామి వారి శేష వాహనం పుష్పాలతో అలంకరించారు. ఊంజల్ సేవలో ట్రస్టీ వారణాసి దినేష్ రాజ్ సువ్వాడ శ్రీదేవి ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తు లు పాల్గొన్నారు.

# చరిత్రలో తొలిసారి.. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడా సంబరాలు




తిరుపతి: ఏపీ చరిత్రలోనే తొలిసారి క్రీడా సంబరాలు జరపాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి ఆర్.కే రోజా పేర్కొన్నారు. తిరుపతిలో ఆమె మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్ర" పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహి స్తున్నాం. ఆటల వల్ల ఆరోగ్యం, శారీరక దృఢత్వం వస్తుంది. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభించనున్నాం.

15,004 గ్రామ, సచివాలయం పరిధిలో , మండల, జిల్లా,రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహణ. మొత్తం 2లక్షల94 వేల మ్యాచ్ లు నిర్వహిస్తాం. ఐదు కేటగిరిలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. వాటిలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోకో ఉన్నాయి. కాగా ప్రైజ్‌ల కోసం రూ.12 కోట్లు ఖర్చు చేయనున్నాం. రూ. 42 కోట్లతో క్రీడా సామగ్రి కిట్లు అందించనున్నాం.

మొత్తంగా ఈ కార్యక్రమానికి రూ. 58.94 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 46 రోజులు పాటు ఒక పండగ వాతావరణంలో నిర్వహించనున్నాం. 17 ఏళ్లు పైబడిన వారు అందరూ పాల్గొనవచ్చు. యువతలో టాలెంట్ గుర్తించేందుకు ఇది మంచి అవకాశం" అని మంత్రి రోజా పేర్కొన్నారు.

# సింధు@28..సాధించిన పతకాలు

న్యూఢిల్లీ : ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి సింధు జూలై 5వ తేదీన 28వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. 1995 జూలై 5న హైదరాబాద్‌లో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు పి.వి రమణ, విజయలిద్దరూ వాలీబాల్ క్రీడాకారులైనప్పటికీ.. తాను మాత్రం ప్రముఖ బ్యాడ్మింటన్ పుల్లెల గోపీచంద్ స్ఫూర్తితో బ్యాడ్మింటన్‌ను ఎంచుకుంది. 2011లో క్రీడా రంగంలో అరంగేట్రం చేసిన ఆమె ఎన్నో పతకాలను సాధించిపెట్టింది. భారత్‌లో క్రీడల్లో రాణిస్తున్న అగ్రగామి మహిళల పేరుల్లో పి.వి సింధు పేరు కూడా చేరింది. పతకాల వారీగా చూస్తే.. ఆమె రెండు ఒలింపిక్స్ పతకాలను సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సాదించింది. ఇక 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచింది. రెండు ఒలింపిక్స్ పతకాలు సాధించిన తొలి భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా సింధు రికార్డు సృష్టించింది. అలాగే ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న తొలి భారతీయురాలు కూడా సింధునే కావడం విశేషం.

సింధు సాధించిన పతకాలు..

– బాసెల్‌లో జరిగిన 2019 ఈవెంట్‌లో ఆమె బంగారం పతకం కైవసం చేసుకుంది.

– 2017, 2018 ఈవెంట్‌లలో రజత పతకాలను, 2013, 2014 ఈవెంట్‌లలో కాంస్య పతకాలను గెలుచుకుంది. దీంతో ఆమె చాంపియన్‌షిప్‌లలో ఐదుసార్లు పతక విజేతగా నిలిచింది.

– 2022 బర్మింగ్‌హామ్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళల సింగిల్స్ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. 2018 గోల్డ్ కోస్ట్ నగరంలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో మిక్స్‌డ్ ఈమ్ ఈవెంట్‌ను గెలుచుకుంది

– 2018 గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్‌లో మహిళల సింగిల్స్‌లో ఆమె కాంస్య పతకం గెలుచుకుంది. 2022 జరిగిన కామన్వెల్త్‌లో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజిత పతకాన్ని కూడా సాధించింది.

– సింధు రెండు ఆసియా క్రీడల్లో పతకాలు సాధించింది. 2018లో జకర్తాలో జరిగిన ఈవెంట్‌లో రజత పతకం, 2014 ఇంచియాన్‌లో జరిగిన ఈవెంట్‌లో కాంస్య పతకం గెలుచుకుంది.

– బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యుఎఫ్) ర్యాంకింగ్స్‌లో 2017లోనే సింధు రెండవ స్థానంలో నిలిచింది.

– ప్రపంచంలోనే అగ్రశ్రేణి మహిళల టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఉబెర్ కప్‌లో సింధు రెండు కాంస్య పతకాలను సాధించారు.

– సింధు ఈ పతకాలతోపాటు స్విస్ ఓపెన్, సింగపూర్ ఓపెన్, సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ మొదలైన అనేక బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యుఎఫ్) వరల్డ్ టూర్ టైటిళ్లను కూడా గెలుచుకుంది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com